


# విజయభాను




విశాఖపట్నం, ఆదివారం 15-12-2019 | VIJAYABHANU DAILY ★ VISAKHAPATNAM | సంపుటి : 43 సంచిక : 84 పేజీలు : 8 వెల : 1 రూపాయి

# నమామి గంగే..

- నేషనల్ గంగా కౌన్సిల్ సమావేశం
- హాజరైన యూపీ, ఎన్డీఏ నేతలు
- గంగానదిలో ప్రధాని మోదీ బోట్‌షికార్





లక్నో: ఉత్తర్‌ప్రదేశ్ కాన్పూర్‌లోని అటల్ ఘాట్ వద్ద ప్రధాని నరేంద్ర మోదీ పవిత్ర గంగానదిలో విహరించారు. ఉత్తర్‌ప్రదేశ్ బీజేపీ సీనియర్ నేతలతో పాటు ఎన్డీఏ మిత్రపక్ష నేతలు మోదీ వెంట ఉన్నారు. యూపీ ముఖ్యమంత్రి యోగీ ఆదిత్యనాథ్, ఉత్తరాఖండ్ సీఎం త్రివేంద్ర సింగ్ రావత్, బిహార్ డిప్యూటీ సీఎం సుశీల్ మోదీ గంగానదీలో పర్యటించారు. అంతకుముందు చంద్రశేఖర్ ఆజాద్ యూనివర్సిటీలో మోదీ అధ్యక్షతన జరిగిన నేషనల్ గంగా కౌన్సిల్ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి కేంద్ర జల్‌శక్తి మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్ కూడా హాజరయ్యారు. అనంతరం కేంద్రమంత్రులు, ఆయా రాష్ట్రాల ముఖ్యమంత్రులు, ఉన్నతాధికారులతో తరువాయి 2లో..

# తీవ్ర నిరాశలో 'నిర్భయ' దోషులు..

- జైల్లో సరిగా తినడం లేదట
- ఉరి శిక్ష సన్నాహాలతో భయం



న్యూఢిల్లీ : నిర్భయ కేసులో నలుగురు దోషులకు ఉరి తీసే తేదీ సమీపిస్తున్న నేపథ్యంలో వారు తీహార్ జైల్లో తీవ్ర నిరాశలో ఉన్నారని జైలువర్గాలు వెల్లడించాయి. నిర్భయ హత్యాచారం కేసులో దోషులైన పవన్ కుమార్ గుప్తా, ముకేశ్, వినయ్ శర్మ, అక్షయ్ కుమార్‌సింగ్‌లను ప్రత్యేక జైలు గదుల్లో ఉంచి, ఒక్కొక్కరికి ఐదుగురు పోలీసుల భద్రతను ఏర్పాటు చేశారు. నిర్భయ కేసు దోషి అయిన రాంసింగ్ 2013లో జైల్లో ఆత్మహత్య చేసుకున్న దృష్ట్యా ఈ నలుగురు దోషులకు తమిళనాడు పోలీసులతో నిరంతర పహారా ఏర్పాటు చేశారు. శుక్రవారం వీడియోకాన్ఫరెన్స్ ద్వారా నలుగురు దోషులు కోర్టు విచారణకు హాజరయ్యారు. నిర్భయ కేసు దోషులు నలుగురు జైల్లో సరిగా తినడం లేదని తీహార్ తరువాయి 2లో..

## ధర్మేంద్ర ప్రధాన్ ప్రకటనను వ్యతిరేకిస్తున్నాం

విశాఖపట్నం : విశాఖ స్టీల్ ప్లాంట్‌కు చెందిన 3400 ఎకరాల భూమిని పోస్కో సంస్థకు కేటాయించాలన్న కేంద్రమత్రి ధర్మేంద్ర ప్రధాన్ ప్రకటనను వ్యతిరేకిస్తున్నామని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దాడి వీరభద్రరావు అన్నారు. స్టీల్ ప్లాంట్‌ను ప్రైవేటు కంపెనీలకు ధారాదత్తం చేస్తే చూస్తూ ఊరుకునే లేదని తెలిపారు. విశాఖ స్టీల్ ప్లాంట్ కొరకు కేంద్ర తరువాయి 2లో..



గొల్లపూడి మృతదేహం వద్ద నివాళులు అర్పించిన సినీ ప్రముఖులు చిరంజీవి, సుహాసిని తదితరులు

వార్త 7వ పేజీలో..

# స్టీల్ ప్లాంట్ భూములను ఏపీ హైగ్రేడ్ స్టీల్స్‌కు అప్పగించాలి

ప్రభుత్వ ఉత్తర్వులు జారీ

అమరావతి: వైఎస్సార్ జిల్లాలో ఇంటిగ్రేటెడ్ స్టీల్ ప్లాంట్ నిర్మాణం కోసం ఏపీ హైగ్రేడ్ స్టీల్స్ లిమిటెడ్‌కు 3,148.68 ఎకరాల భూమిని ముందస్తుగా అప్పగించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు వైఎస్సార్ కలెక్టర్‌కు అనుమతిస్తూ ఉత్తర్వులు తరువాయి 2లో..

# సమస్యలున్నందునే ఆర్‌సీఈపీలో చేరలేదు

## విజయసాయిరెడ్డి ప్రశ్నకు పీయూష్ గోయల్ సమాధానం

న్యూఢిల్లీ: ప్రాంతీయ సమగ్ర ఆర్థిక భాగస్వామ్యం (ఆర్‌సీఈపీ) మార్గదర్శక సూత్రాలకు అనుగుణంగా రూపుదిద్దుకోలేదని, ఈ ఏడాది బ్యాంకాక్‌లో జరిగిన ఆర్‌సీఈపీ తృతీయ సదస్సులో లేవనెత్తిన పలు అంశాలకు పరిష్కారం చూపనందునే భాగస్వామ్య ఒప్పందంలో భారత్ చేరలేదని వాణిజ్య శాఖ మంత్రి పీయూష్ గోయల్ తెలిపారు.

రాజ్య సభలో శుక్రవారం వైఎస్సార్‌సీపీ పార్లమెంటరీ పార్టీనేత వి.విజయసాయిరెడ్డి అడిగిన ప్రశ్నకు ఆయన రాతపూర్వకంగా జవాబిచ్చారు. దేశీయ రంగాల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకునే ఆర్‌సీఈపీలో వివిధ అంశాలపై సమతుల్యత సాధించే దిశగా ప్రయత్నాలు జరిగినట్లు తెలిపారు.

### హాల్‌మార్కింగ్ తప్పనిసరి

ఇకపై 14, 18, 22 క్యారెట్ల బంగారు నగలపై హాల్ మార్కింగ్ తప్పనిసరి చేయనున్నట్టు కేంద్ర వినియోగదారుల వ్యవహారాల మంత్రి రావ్ సాహెబ్ దాదారావ్ దాన్వే తెలిపారు. తరువాయి 2లో..

# సత్వరమే పెండింగ్ పనులు పూర్తి చేయాలి

- ఎత్తిపోతల ద్వారా నీరందాలి
- అర్హులందరికీ ఇళ్ల పట్టాలు
- వేసవికల్లా సాగునీరు
- యురేనియం పైపులైన్ ప్రతిపాదనలు
- సీఎం పర్యటన నేపథ్యంలో అధికారులతో ఎంపీ భేటీ



పులివెందుల: ముఖ్యమంత్రి ఈనెలలో చేపట్టనున్న పర్యటన నేపథ్యంలో పులివెందుల నియోజకవర్గంలో పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులను వీలైనంత త్వరగా పూర్తి చేయాలని కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి పేర్కొన్నారు.

శుక్రవారం సాయంత్రం స్థానిక ఏపీ కార్ల్‌లో నియోజకవర్గ అభివృద్ధి పనులపై అన్ని శాఖల అధికారులతో ఆయన ఓఎస్డీ అనిల్ కుమార్ రెడ్డితో కలిసి శాఖల వారీగా సమీక్షించారు. ఇప్పటికే పలు పర్యాయాలు ఈయన సమీక్షలు నిర్వహించిన సంగతి తెలిసిందే.

సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈనెల 23నుంచి జిల్లాలో మూడు రోజులపాటు పర్యటించనుండటంతో అధికారులతో ఎంపీ మరోమారు భేటీ అయ్యారు. లింగాల కెనాల్, లెఫ్ట్ తరువాయి 2లో..

# భూములు కోల్పోయిన రైతులను తప్పక ఆదుకుంటాం

## 'చంద్రబాబుకు అసహనం పెరిగిపోతోంది'

## పురపాలక శాఖ మంత్రి బొత్స సత్యనారాయణ



విశాఖపట్నం : రాష్ట్ర సమగ్రాభివృద్ధి అధ్యయనం నేపథ్యంలో రవీంద్రనాథ్ అధ్యక్షతన ఏపీలోని 13 జిల్లాలో కమిటీ పర్యటిస్తుందని పురపాలక శాఖ మంత్రి బొత్స సత్యనారాయణ పేర్కొన్నారు. దీనికి సంబంధించిన నివేదికను త్వరలోనే ప్రభుత్వానికి అందివ్వనుంది. కాగా, ఆ నివేదికలోనే రాజధాని అంశం కూడా ఇమిడి ఉందని మంత్రి స్పష్టం చేశారు. రాజధాని పేరుతో భూములు కోల్పోయిన రైతులకు ఇచ్చిన మాట ప్రకారం ఆదుకుంటామని తెలిపారు. ప్రస్తుతం జరుగుతున్న అసెంబ్లీ శీతాకాల సమావేశాలను టీడీపీ సజావుగా జరగనివ్వడం లేదని మండిపడ్డారు. అసభ్య పదజాలంతో మార్షల్స్, ఉద్యోగులపై దౌర్జన్యంగా వ్యవహరిస్తున్నారని తెలిపారు. చంద్రబాబుకు రోజురోజుకు అసహనం పెరిగిపోయి సహనం కోల్పోతున్నారని దుయ్యబట్టారు. ప్రజలు తప్పు చేశారని చంద్రబాబు భావిస్తున్నారు.. కానీ ఆయనే సజావుగా జరగాల్సిన సభను అడ్డుకొని తప్పు చేస్తున్నారని మండిపడ్డారు. కాగా, చంద్రబాబు పాలనలో రాష్ట్రమంతా అవినీతి కూపంగా తయారైందని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ వైఎస్సార్ స్ఫూర్తితో అభివృద్ధి, సంక్షేమాన్ని సమాంతరంగా ముందుకు తీసుకెళ్తున్నారని తెలిపారు.

వచ్చే ఏడాది రాష్ట్రంలోని 109 మున్సిపాలిటీలకు ఎన్నికలు నిర్వహించాలనే ఆలోచనలో ప్రభుత్వం ఉందని వెల్లడించారు.

# శబరిమలపై జోక్యం చేసుకోలేం

- మహిళా భక్తులకు రక్షణ కల్పించాలన్న విజ్ఞప్తిని తిరస్కరించిన సుప్రీంకోర్టు
- ఏడుగురు సభ్యుల ధర్మాసనం నిర్ణయం తీసుకుంటుందని వెల్లడి



న్యూఢిల్లీ: శబరిమల అయ్యప్ప దర్శనానికి వెళ్లే మహిళా భక్తులకు రక్షణ కల్పించాలంటూ కేరళ ప్రభుత్వాన్ని ఆదేశించాలన్న విజ్ఞప్తిని సుప్రీంకోర్టు తిరస్కరించింది. అయ్యప్ప దర్శనానికి వెళ్లే మహిళలకు కేరళ ప్రభుత్వం రక్షణ కల్పించడం లేదంటూ, ఇందులో జోక్యం చేసుకోవాలని కోరుతూ ఇద్దరు మహిళా కార్యకర్తలు సుప్రీం కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై శుక్రవారం ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎస్ఏ బోబ్డే నేతృత్వంలోని ధర్మాసనం విచారణ జరిపింది. ఈ సందర్భంగా ఓ పిటిషనర్ తరఫు న్యాయవాది కొలిన్ గొంజాల్వెజ్ వాదనలు వినిపిస్తూ అన్ని వయస్సుల మహిళలు శబరిమల వెళ్లడానికి అనుమతించాలంటూ గతంలో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును కేరళ ప్రభుత్వం ఉల్లంఘిస్తున్నదని, మహిళలను అయ్యప్ప దర్శనానికి అనుమతించడం లేదని చెప్పారు. దర్శనానికి వెళ్లే మహిళా భక్తులకు రక్షణ కల్పించేలా కేరళ ప్రభుత్వాన్ని ఆదేశించాలని కోరారు. దీంతో ధర్మాసనం స్పందిస్తూ ప్రస్తుతం శబరిమలలో పరిస్థితి చాలా ఉద్వేగభరితంగా ఉన్నది. మనం రోజూ పత్రికల్లో చూస్తూనే ఉన్నాం. ఇలాంటి సమయంలో మేము ఎలాంటి ఆదేశాలు జారీ చేసినా సమస్య మరింత జఠిలంగా మారుతుంది. ఇది మాకు ఇష్టం లేదు. కాబట్టి ప్రస్తుతం ఎలాంటి ఆదేశాలు జారీ చేయలేం అని పేర్కొన్నది. తమ తీర్పుపై సమీక్ష కోరుతూ దాఖలైన పిటిషన్లను ఇప్పటికే ఏడుగురు సభ్యుల ధర్మాసనానికి బదిలీ చేశామని, ఈ ధర్మాసనం త్వరగా ఏర్పాటయ్యేలా చొరవ తీసుకుంటామని తెలిపింది. అన్ని వయసుల మహిళలు అయ్యప్పను దర్శించుకోవచ్చంటూ మేము గతంలో తీర్పు నిచ్చాం.. నిజమే. కానీ మా తీర్పుపై సమీక్ష కోరుతూ పలు పిటిషన్లు దాఖలయ్యాయి. వాటిని ఏడుగురు సభ్యుల తరువాయి 2లో..





వేపగుంట దరి నాయుడు తోటలో జరుగు తున్న కీర్తి శేషులు మాజీ ఎంపీ పేతకంశెట్టి అప్పలనరసింహం జ్ఞాపకార్థం శ్రీ సాయి శ్రీనివాస కల్చరల్ అసోసియేషన్, విశాఖపట్నం. వారు నిర్వహించిన సింహాద్రి అవార్డ్సు - 2019. నాటక పోటీలను జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించిన పశ్చిమ నియోజకవర్గం ఎమ్మెల్యే గణ బాబు. ఈ కార్యక్రమంలో నిర్వహికులు పిల్లా రాంబాబు, పొలిమేర సీతారాం, సుబ్రమణ్యం, పాత్రుడు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు

### సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు రామునాయుడు



గొలుగొండ : కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తున్నాయని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు మాకిరెడ్డి రామునాయుడు ఆరోపించారు. శనివారం గొలుగొండ మండల కేంద్రంలో సిపిఐ ముఖ్య కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విధానాలు ప్రజలను మభ్యపెట్టి కార్పొరేట్ సంస్థలకు అనుకూలంగా వ్యవహరిస్తున్నారన్నారు. ఆంధ్ర రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇవ్వాలని, ప్రత్యేక హోదా విభజన చట్టంలో ఉన్న హామీలు అమలు చేయాలనే విషయాన్ని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు మర్చిపోవడం విడ్డూరంగా ఉందన్నారు. మోసపూరితమైన పథకాలు ప్రవేశపెట్టి సామాన్య ప్రజలను నడ్డి విరిచే విధంగా ఆర్టీసి చార్జీలు తీవ్రంగా పెంచడమే ఒక ఉదాహరణ అన్నారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇవ్వడం ద్వారా రాష్ట్రాభివృద్ధి చెందుతుంది తప్పా సచివాలయాలకు రంగులు మార్చడం వలన అభివృద్ధి చెందుతుందా అని ప్రశ్నించారు. భవిష్యత్ కార్యక్రమంలో ప్రత్యేక హోదా ఇచ్చేంత వరకు భారత కమ్యూనిస్టు పార్టీ ఆధ్వర్యంలో పోరాటాలు నిర్వహిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా కార్యదర్శి మేకా సత్యనారాయణ, వ్యవసాయ కార్మిక సంఘం మండల అధ్యక్షులు కిల్లాడ అప్పలనాయుడు, ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షులు జి.రాధాకృష్ణ, సిపిఐ మండల సహాయ కార్యదర్శి జోగా సత్తిబాబు, ఏఐటియుసి నాయకులు పోతల సత్యనారాయణ, గిరిజన సమాఖ్య మండల కార్యదర్శి సర్వేపల్లి చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

## 16న సత్యదేవుని మెట్లోత్సవం



అన్నవరం : తూ.గో.జిల్లా ప్రముఖ పుణ్యక్షేత్రము అన్నవరం శ్రీ వీరవేంకట సత్యనారాయణ స్వామివారి సన్నిధిలో ధనుర్మాసం ప్రారంభోత్సవమును పురస్కరించుకుని ప్రతీ సంవత్సరము సాంప్రదాయబద్ధముగా నిర్వహించే మెట్లోత్సవ కార్యక్రమానికి మెట్ల మార్గాన్ని సర్వాంగ సుందరంగా రంగులు వేసి అలంకరిస్తున్నారు. 16వ తేదీ సోమవారం శ్రీ సత్యదేవుని మెట్లోత్సవం ఘనంగా నిర్వహిస్తారు.ఆరోజు శ్రీ సత్యదేవుడు,అమ్మవార్ల ఉత్సవమూర్తులను సోమవారం ఉదయం ఎనిమిది గంటలకు ఊరేగింపుగా మెట్ల మార్గముగా కొండదిగువకు తీసుకువస్తారు.అనంతరం తొలిపాంచా వద్ద గల కనకదుర్గ అమ్మవారి ఆలయంలో స్వామి, అమ్మవార్లకు పూజలు నిర్వహించిన అనంతరం గ్రామంలో ఘనంగా ఊరేగిస్తారు. అనంతరం రత్నగిరి మెట్ల దారిలోని ప్రతిమెట్టుకు పసుపు, కుంకుమ పెట్టి,హారతి వెలిగిస్తూ,పల్లకీపై స్వామి, అమ్మవార్లను ఊరేగింపుగా ప్రధానాలయానికి చేరుస్తారు.శ్రీ మహావిష్ణు కు అత్యంత ప్రీతి కరమైన ధనుర్మాసములో విష్ణు స్వరూపుడైన శ్రీ సత్యదేవునికి విశేషమైన పూజలు నిర్వహిస్తారు.కావున యావన్మంది భక్త జనులు శ్రీ స్వామివారి మెట్లోత్సవం పాల్గొని శ్రీ స్వామి, అమ్మవార్ల కృపా కటాక్షములకు పాత్రులు కావలసిందిగా ఈవో వి.త్రినాధరావు కోరారు.ఇప్పటికే ఆలయ పిఆర్వో కొండలరావు, ఆలయ అధికారులు తగిన ఏర్పాట్లను పూర్తి చేశారు.

## భీమిలి రూరల్ మండల బీజేపీ అధ్యక్షుడిగా బత్తిన వెంకటరమణ



భీమునిపట్నం: భీమిలి మండలం చేపల దెబ్బల పాలెంలో భారతీయ జనతా పార్టీ డివిజన్ ఎన్నికల అధికారి బిఎస్ఎన్ఎల్ సలహా మండలి సభ్యులు ఉప్పాడ అప్పారావు మరియు బిజెపి నాయుకులు కార్యకర్తల ఆధ్వర్యంలో భీమిలి రూరల్ మండల అధ్యక్షుడిగా బత్తిన వెంకట రమణ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ ప్రమాణ స్వీకారానికి నగర ఎన్నికల ఇంచార్జ్ బి. లక్ష్మీనారాయణ అనంతపురం మండల అధ్యక్షుడు ప్రసాద్ పట్నాయక్, భీమిలి బిజెపి నాయకత్వం ఎస్. బాబురావు, మండల నాయకులు ఎస్ ఎల్ఆర్ఆర్ఆర్ అప్పన్న పి.అప్పలనాయుడు వాసుపల్లి దానయ్య తదితరులు పాల్గొన్నారు.

## విద్యుత్ ఆదాపై విద్యార్థుల ప్రచారం



విద్యుత్ ఆదాపై ప్రచారం చేస్తున్న విద్యార్థులు

గొలుగొండ : చీడిగుమ్మల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల జూనియర్ రెడ్ క్రాస్ ఆధ్వర్యంలో జాతీయ శక్తి సంరక్షణ దినోత్సవం సందర్భంగా శనివారం విద్యుత్ శక్తిని ఆదా చేసి తర్వాత తరాలకు అందజేయాలనే లక్ష్యంతో ప్రచార కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా రెడ్ క్రాస్ నాయకుడు మణికంఠ మాట్లాడుతూ వచ్చే నెల రోజుల వరకూ చీడిగుమ్మల, పరిసర గ్రామాలలో ప్రతి ఇంటికి వెళ్లి తమ బృందం విద్యుత్‌ను పొదుపు చేసే వివిధ మార్గాల గురించి వివరించు తెలియజేశారు. ముఖ్యంగా అనవసరంగా యంత్రాలను ద్వారా కూడా ఎక్కువ మోతాదులో విద్యుత్ దుర్వినియోగం జరుగుతోందని, భారతదేశంలో థర్మల్ విద్యుత్ ఎక్కువ మోతాదులో వినియోగం చేస్తున్నారని, దీనికి బదులుగా సోలార్ విద్యుత్ వినియోగం పెంచాలని కోరుతున్నామన్నారు. అదే విధంగా పల్లెల్లో ఇప్పటివరకు కూడా సాధారణ బల్బులు వాడుతున్నారని వాటి బదులుగా ఎల్ఈడీ బల్బులు వాడడం ద్వారా అధిక మొత్తంలో విద్యుత్‌ను పొదుపు చేయడమే కాకుండా కరెంటు బిల్లు కూడా తగ్గించుకోవచ్చని తెలియజేశారు. అదే విధంగా ఈ కార్యక్రమంలో పాఠశాల రెడ్ క్రాస్ కోఆర్డినేటర్ ఎబి. రాజగోపాల్ మాట్లాడుతూ తమ పాఠశాల తరపున విద్యుత్ పొదుపు లక్ష్యంగా ముఖ్యంగా ఎర్ర బల్బు వద్దు ఎల్ఈడీ బల్బులు ముద్దు అనే నినాదంతో చైతన్య కార్యక్రమాలను చేపడుతున్నట్లు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు జిఎస్.నాగేంద్ర, పాఠశాల కమిటీ చైర్మన్ ఆవుగడ్డ నూకరత్నం విద్యార్థులు పాల్గొన్నారు.

## శ్రీ సత్యదేవుని కార్తీకమాస ఆదాయం 27 రోజులకు రూ.15,71,37,946/-

### - సత్యదేవుని కార్తీకమాసము ఆదాయం గత సంవత్సరం కంటే రూ.80,11,010/- ఎక్కువ

### - ఆదాయ వివరాలు తెలియజేసిన ఈవో వి.త్రినాధరావు, చైర్మెన్ ఐ.వి. రోహిత్



అన్నవరం : తూ.గో.జిల్లా ప్రముఖ పుణ్యక్షేత్రము అన్నవరం శ్రీ వీరవేంకట సత్యనారాయణ స్వామివారి కార్తీకమాసము ఆదాయము 27 రోజులకు రూ.15,71,37,946/- వచ్చిందని దేవస్థానం ఈవో వి.త్రినాధరావు, ఛైర్మన్ ఐ.వి.రోహిత్‌లు శనివారం పాత్రికేయులు సమావేశంలో వెల్లడించారు. వివరాల లోకి వెళ్లితే గత సంవత్సరం కంటే ఈ సంవత్సరం రూ.80, 11,010/-ఆదాయం ఎక్కువ వచ్చినట్టు తెలిపారు.ఈ సందర్భంగా గత సంవత్సరం కార్తీకమాసము ఆదాయం మరియు ఈ సంవత్సరం కార్తీకమాసము ఆదాయాల వివరాలు తెలియ జేశారు.

- వ్రతాల ద్వారా 2018 లో ఆదాయం రూ.6,80,09,333/- రాగా ఈ సంవత్సరం రూ.7,05,77,600/- వచ్చింది. - ప్రసాదముల ద్వారా 2018లో ఆదాయం రు.3,23,17,320/- రాగా ఈ సంవత్సరం రూ.3,41,38,110/- వచ్చింది. - దర్శన ముల ద్వారా 2018లో ఆదాయం రూ.94,21,100/- రాగా ఈ సంవత్సరం రూ.1,03,61,800 వచ్చింది. - కాటేజీల ద్వారా 2018లో ఆదాయం రూ.86,32,864/- రాగా ఈ సంవత్సరం రూ.81,59,545/- వచ్చింది. - రవాణా విభాగం ద్వారా 2018లో ఆదాయం రూ.23,78.205/- రాగా ఈ సంవత్సరం రూ.20,22,464/- వచ్చింది. -వ్రతాలలో కొబ్బరి ముక్కలు ద్వారా 2018లో ఆదాయం రూ.14,28,419/- రాగా ఈ సంవత్సరం రూ.9,59,463/- వచ్చింది. - టోల్ గేటు ద్వారా 2018లో ఆదాయం రూ.14,51,775/- రాగా ఈ సంవత్సరం రూ.15,26,865/- వచ్చింది. -వ్రతాల విభాగంలో ఏసి చార్జీల ద్వారా 2018లో ఆదాయం రూ.25,38,590/- రాగా ఈ సంవత్సరం రూ.30,68,000/- వచ్చింది. - కేశ ఖండన ద్వారా 2018లో ఆదాయం రూ.12,90.650/- రాగా ఈ సంవత్సరం రూ.12,55,459/- వచ్చింది. -హుండీల ద్వారా 2018లో ఆదాయం రూ.2,03,05,521/- రాగా ఈ సంవత్సరం రూ.2,35,52,251/- వచ్చింది.

- శ్రీ స్వామివారి సేవలు మరియు కళ్యాణాలు ద్వారా 2018లో రూ.13,53,249/- రాగా ఈ సంవత్సరం రూ.15,16,398/- వచ్చింది. మెత్తం మీద గత సంవత్సరం కార్తీకమాసము 27 రోజులకు రూ.14,91,26,936/- ఆదాయం రాగా ఈ సంవత్సరం రూ.15,71,37,946/- ఆదాయం సమకూరిందని దేవస్థానం ఈవో వి.త్రినాధరావు, చైర్మెన్ ఐ.వి.రోహిత్,ఏసి రమేష్ బాబు తెలియజేశారు.ఈ సందర్భంగా ఈవో త్రినాధరావు,చైర్మన్ ఐ.వి.రోహిత్ మాట్లాడుతూ దేవస్థానం అభివ ృద్ధి కొరకై కొండ దిగువన ఆర్టీసి కాంప్లెక్స్ ఎదురుగా ఉన్న దేవస్థానం క్వార్టర్స్ ప్రక్కన గల స్థలంలో భక్తుల సౌకర్యార్థం డార్మిటరీ హాలు నిర్మాణం మరియు డార్మిటరీ హాలు నుండి కొండదిగువన తొలిపావాంచ వరకు ఫుట్ పాత్ ఏర్పాటు,తూర్పు రాజగోపురం నుండి రావిచెట్టు వరకు గ్రానైట్ మెట్లు ఏర్పాటు తదితర అభివ ృద్ధి పనులు చేపడతామని తెలియజేశారు.ఈ కార్యక్రమంలో ఏఈవో లు ప్రసాద్,అనంతలక్ష్మి సత్యవతీ దేవి, పిఆర్వో కొండలరావు,టెంపుల్ ఇన్ స్పెక్టర్ పోల్నాటి లక్ష్మినారాయణ, పసుపులేటి రమేష్, గణపతి తదితరులు పాల్గొన్నారు.

మొదటి పేజీ తరువాయి

## తీవ్ర నిరాశలో 'నిర్భయ' దోషులు..

జైలు అధికారులు చెప్పారు. దోషులు నలుగురు గతంలో సుష్టుగా భోజనం చేసేవారని... కానీ ఉరి తీసే తేదీ సమీపిస్తున్న నేపథ్యంలో వారు తీసుకునే ఆహారం తగ్గించారని తీహార్ జైలు వర్గాలు వెల్లడించాయి. తీహార్ జైల్లో నిర్భయ దోషులను ఉరి తీయనున్న 3వ నంబరు ఉరి స్తంభం ప్రాంతాన్ని తీహార్ జైలు డైరెక్టరు జనరల్ సందీప్ గోయల్ తోపాటు ఇతర జైలు సీనియర్ అధికారులు సందర్శించి, ఉరి శిక్ష సన్నాహాలను చూసి సంతృప్తి వ్యక్తం చేశారు.

## నమామి గంగే

కలిసి మోదీ బోట్‌రైడ్‌కు వెళ్లారు. మోదీ సర్కార్ నమామి గంగ ప్రాజెక్టు పేరిట గంగానది ప్రక్షాళన కార్యక్రమాన్ని చేపట్టిన విషయం తెలిసిందే. గంగానది పరివాహక ప్రాంతాలైన పశ్చిమ బెంగాల్, ఝార్ఖండ్ రాష్ట్రాల ముఖ్యమంత్రులు ఈ పర్యటనకు గైర్హాజరయ్యారు.

## స్టీల్ ప్లాంట్ భూములను ఏపీ హైగ్రేడ్ స్టీల్స్‌కు అప్పగించాలి

శుక్రవారం జారీ చేసింది. ఇంటిగ్రేటెడ్ స్టీల్ ప్లాంట్ నిర్మాణం కోసం వైఎస్సార్ జిల్లా జమ్మలమడుగు మండలం పెద్దండ్లూరు, సున్నపురాళ్లపల్లి గ్రామాల పరిధిలో 3148.68 ఎకరాలను జీవో571 ప్రకారం ఎకరా రూ.1.65 లక్షల ధరతో కేటాయించాలని ప్రభుత్వం ఇప్పటికే నిర్ణయం తీసుకుంది. భూమిని ఏపీ హైగ్రేడ్ స్టీల్స్‌కు ముందస్తుగా అప్పగించాలని గత నెల 27న మంత్రివర్గ సమావేశం తీర్మానించింది. ప్రభుత్వ నిర్ణయం ప్రకారం తక్షణమే ఏపీ హైగ్రేడ్ స్టీల్స్‌కు భూమిని అప్పగించాలని వైఎస్సార్ జిల్లా కలెక్టర్‌ను రెవెన్యూ శాఖ కార్యదర్శి వి.ఉషారాణి ఆదేశించారు. భూకేటాయింపునకు వీలుగా ప్రతిపాదనను త్వరగా భూ యాజమాన్య సంస్థ (ఏపీఎల్ఎంఏ)లో ఆమోదించి ప్రభుత్వానికి పంపించాలని ఆమె రాష్ట్ర భూపరిపాలన ప్రధాన కమిషనర్ (సీసీఎల్ఏ)ను ఆదేశించారు. ఈనెలలోనే వైఎస్సార్ జిల్లాలో స్టీల్ ప్లాంట్ నిర్మాణానికి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేతుల మీదుగా శంకుస్థాపన చేయాలని ప్రభుత్వం నిర్ణయించిన నేపథ్యంలో రెవెన్యూ శాఖ ఈ ఆదేశాలు జారీ చేసినట్లు అధికార వర్గాలు తెలిపాయి.

## సత్వరమే పెండింగ్ పనులు పూర్తి చేయాలి

కెనాల్, గండికోట లిఫ్ట్ ఇరిగేషన్ పనుల గురించి అవినాష్‌రెడ్డి ఆరా తీశారు. భూసేకరణ, నష్టపరిహారానికి సంబంధించి నివేదికలు పూర్తి చేయాలన్నారు. పెండింగ్ పనుల నివేదికలు జనవరి 15వ తేదీలోగా ప్రభుత్వానికి నివేదించాలన్నారు. లింగాల బ్రాంచ్ డిస్ట్రిబ్యూటరీ పెండింగ్ పనులను వెంటనే పూర్తి చేయాలి. ఈనెలాఖరుకల్లా మైక్రో ఇరిగేషన్ ప్రతిపాదనలు సిద్ధం చేయాలని చెప్పారు. వచ్చే వేసవి నాటికి ఎత్తిపోతల పథకాల పనులు పూర్తి చేసి సాగునీరు అందేలా చూడాల ని కోరారు. సీబీఆర్ కుడి కాలువకు సంబంధించి 9, పీబీసీలో 6 పనులకు త్వరలోనే టెండర్లను పిలుస్తామని ఇరిగేషన్ అధికారులు యంపీకి తెలిపారు. ముఖ్యమంత్రి శంకుస్థాపనలు చేసిన నెల రోజుల్లోపు పనులు మొదలుపెట్టేలా చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు.

యురేనియం పైపు లైను ప్రతిపాదనలు

యురేనియం గ్రామాలకు నీటి సరఫరా చేసేందుకు పైపులైన్ పనుల ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఎంపీ సూచించారు. మైక్రో ఇరిగేషన్ విషయంలో నియోజకవర్గం మోడల్‌గా ఉండేందుకు అధికారులు కృషి చేయాలన్నారు. మైనర్ ఇరిగేషన్ పనులపై ఆరా తీశారు. మైనర్ ఇరిగేషన్‌లో చెక్‌డ్యాంలు, ట్యాంక్‌లు, పొలాలు కోతకు గురి కాకుండా ప్రొటెక్షన్ వాల్స్‌కుసంబంధించి రూ.30కోట్లు అంచనాతో 203పనులకు ప్రతిపాదనలు సిద్ధం చేశామని అధికారులు వివరించారు. వేముల చెరువు పక్కన నష్టపోయిన కొంతమంది చీనీ రైతులకు నష్టపరిహారం అందేలా చర్యలు తీసుకోవాలని ఎంపీ అధికారులకు సూచించారు. చెక్‌డ్యాంలు, ట్యాంక్‌ల వల్ల భూములు కోల్పోయిన వారికి నష్టపరిహారానికి అంచనాలు సిద్ధం చేయాలన్నారు.

ఇళ్ల స్థలాలు సిద్ధం చేయండి

ఉగాది నాటికి అర్హులందరికి ఇళ్ల పట్టాలు ఇవ్వాలనే ముఖ్యమంత్రి నిర్ణయం నేపథ్యంలో స్థలాల సేకరణ పూర్తికావాలని ఎంపీ చెప్పారు. గత ప్రభుత్వాల హయాంలో పేదలకు హడావుడిగా ఇళ్ల పట్టాలు ఇవ్వడం జరిగిందని.. కానీ వారికి స్థలాలు చూపించలేదన్నారు. లేఔట్లు వేసి అర్హులకు ఇంటి స్థలాన్ని చూపించే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులకు ఎంపీ చెప్పారు. ఉగాది పండుగ ముందు రోజు వరకు కూడా అర్హులుంటే గుర్తించాలన్నారు. గ్రామీణ ప్రాంతాలలో ఇళ్ల స్థలాలు గ్రామాలకు దగ్గరగా ఉండే విధంగా చూడాలన్నారు. పీబీసీ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రోహిణి, జీఎన్ఎస్ఎస్ ఎస్ఈ మధుసూదన్‌రెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ ప్రసన్నకుమార్, హౌసింగ్ పీడీ రామచంద్రన్, డీఈ వీరన్న, పులివెందుల కమిషనర్ నరసింహారెడ్డి, తహసీల్దార్ శ్రీనివాసులు, ఇతర అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు. తర్వాత ఇండోర్ స్టేడియం నిర్మాణ పనులను అవినాష్‌రెడ్డి పరిశీలించారు.

## శబరిమలపై జోక్యం చేసుకోలేం

విస్తృత ధర్మాసనానికి బదిలీ చేశాం. కాబట్టి గతంలో మేము ఇచ్చిన తీర్పే అంతిమం కాదు. ఏడుగురు సభ్యుల ధర్మాసనం తీర్పునిస్తుంది అని ధర్మాసనం పేర్కొంది. అదేసమయంలో 2018లో తాము ఇచ్చిన తీర్పును ఎవరైనా ఉల్లంఘిస్తే జైలుకు పంపుతామని హెచ్చరించింది.

## సమస్యలున్నందునే ఆర్‌సీఈపీలో చేరలేదు

రాజ్యసభలో ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి అడిగిన ప్రశ్నకు మంత్రి సమాధానమిచ్చారు. దేశవ్యాప్తంగా అక్టోబర్ 31 నాటికి బీఐఎస్ గుర్తింపుతో 877 హాల్ మార్కింగ్ కేంద్రాలు పనిచేస్తున్నాయని, ఇలాంటివి ఏపీలో 43, తెలంగాణలో 29 ఉన్నట్టు వివరించారు.

***దిశ చట్టం తరహాలో దేశవ్యాప్త చట్టం తేవాలి***

దిశ ఘటనపై ఏపీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి స్పందించిన తీరుకు మహిళా లోకం తరపున కృతజ్ఞతలు తెలుపుతున్నామని వైఎస్సార్‌సీపీ ఎంపీ వంగా గీతావిశ్వనాథ్ పేర్కొన్నారు. శుక్రవారం ఆమె పార్లమెంటు ఆవరణలో మీడియాతో మాట్లాడారు. ఏపీలో తెచ్చి న చట్టం తరహాలో దేశవ్యాప్తంగా అమ లయ్యేలా చట్టం తేవాల్సిన అవసరం ఉందని ప్రధానికి, హోంమంత్రికి లేఖ రాస్తామని పేర్కొన్నారు.

## ధర్మేంద్ర ప్రధాన్ ప్రకటనను వ్యతిరేకిస్తున్నాం

ప్రభుత్వం ఇప్పటివరకు రూ.4,890 కోట్లు కేటాయిస్తే కేంద్రానికి పన్నుల రూపంలో స్టీల్ ప్లాంట్ రూ.40,500 కోట్లు చెల్లిందని పేర్కొన్నారు.

రెండు లక్షల కోట్ల విలువైన భూమిని విదేశీ ప్రైవేటు సంస్థలకు రూ.4849 కోట్లకు సెబీ కట్టబెట్టే యత్నం చేస్తోందని ఆరోపించారు. విశాఖ స్టీల్ ప్లాంట్ కు ఇనుప గనులు కేటాయించాలని ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా పట్టించుకోని కేంద్రం టాటా, జిందాల్ లాంటి ప్రైవేటు కంపెనీలకు గనులు కేటాయించిందని మండిపడ్డారు. విశాఖ స్టీల్ ప్లాంట్‌ను నిర్వీర్యం చేయడానికి కుట్ర జరుగుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం తన నిర్ణయాన్ని మార్చుకోకపోతే 1970 తరహాలో మరో మారు భారీ ఉద్యమం తప్పదని వీరభద్రరావు హెచ్చరించారు.

## ప్రతీ నీటిబొట్టును ఆదా చేయాలి



అచ్యుతాపురం : ప్రతి నీటి చుక్కను ఆదా చేయాల్సిన బాధ్యత ప్రజలందరదని ఎస్ఐ జి. లక్ష్మ ణ రావు అన్నారు . శనివారం మండలంలో దిబ్బపాలెం గ్రామం కళ్యాణమండపంలో ఏషియన్ పెయింట్స్ సహకారంతో డాన్ బాస్కో నవజీవన సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన బాలల జల సంఘాల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు . నీటిని ఆదా చేయడంపై విద్యార్థులకు అవగహన కల్పించడం ద్వారా మంచి ఫలితాలినిస్తాయన్నారు . ఈ కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు ఫాదర్ బాలశౌరి , జేమ్స్ , సిస్టర్ సోఫి , పూడిమడక మాజీ సర్పంచ్ చేపల వెంకటరమణ , కె రాజుబాబు , ఎల్ రాజు ,ఆర్ కనకారావు ,ఎల్ చినబాబు , నూకరాజు , వాసుపల్లి అప్పలరాజు , విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు .

**ఉత్తర రైల్వే**

**ఇ-ప్రొక్యూర్‌మెంట్ పద్ధతి ద్వారా టెండరు ప్రకటన**

ప్రిన్సిపల్ చీఫ్ మెటీరియల్ల మేనేజర్, ఉత్తర రైల్వే న్యూఢిల్లీ-110001 వారు ఇ-ప్రొక్యూర్‌మెంట్ విధానంపై భారతరాష్ట్రపతి తరపున దిగువ ఐటమ్‌ల సరఫరా కొరకు టెండర్లను ఆహ్వానిస్తున్నారు.

| క్ర.సం | టెండరు నెం. | సంక్షిప్త వివరణ | పరిమాణం | గడువు తేదీ |
|---|---|---|---|---|
| 01 | 18191273 | ఎల్ఐపిఐ కొరకు రిబ్బన్ కార్ట్రైజ్ విభాగం నెం. 256110-104 | 1396 నెం.లు | 30-12-19 |
| 02 | 18191312 | యాక్సిస్ ఫేర్ టిక్కెట్ బుక్ | 100000 నెం.లు | 06-01-20 |
| 03 | 19191406 | పునాది చక్రంతో ఎఆర్ఎమ్ కాంట్రాక్టు | 14 నెం.లు | 10-01-20 |
| 04 | 09193066ఇ | బఫర్ లంగర్ అసెంబ్లీ | 5798 నెం.లు | 15-01-20 |
| 05 | 19191414 | డబుల్ పోల్ బషింగ్ | 16 నెం.లు | 16-01-20 |
| 06 | 19190915బి | ప్రింటెడ్ సిర్క్యూట్ బోర్డ్ టైప్: పిపిఎ988 బి02 | 19 నెం.లు | 20-01-20 |

గమనిక : 1. అమ్మకందారులు పూర్తి వివరాలను ఐఆర్ఇపిఎస్ సైట్ www.ireps.gov.in లో డౌన్ లోడ్ చేసుకొనవచ్చును. 2. మాన్యువల్ ఆఫర్లు అంగీకరించబడవు

టెండరు ప్రకటన నెం. 20/2019-2020 తేది: 13.12.2019 **3986/19**

వినియోగదారులకు చిరునవ్వుతో సేవలు

## కొత్త పంచాయతీలకు ప్రతిపాదనలు

నాతవరం: ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు మండలంలో కొత్త గ్రామ పంచాయతీల ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నట్లు ఎంపిడిఒ ఎల్.యాదగిరీశ్వరరావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన విలేకర్లతో మాట్లాడుతూ ఇందుకు సంబంధించి ఇప్పటికే రికార్డులు తయారు చేశామన్నారు. వీటిని కలెక్టర్‌కు నివేదిస్తామన్నారు.

## బాల్ బ్యాడ్మింటన్ పోటీలకు ఇవాంజలి

కోటవురట్ల: కోటవురట్ల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో తొమ్మిదో తరగతి విద్యార్థిని ఇవాంజలి జాతీయ స్థాయి బాల్ బ్యాడ్మింటన్ పోటీలకు ఎంపికైంది.

ఈ నెల 5, 6, 7న వడ్డాది మాడుగులో రాష్ట్ర స్థాయి బాల్ బ్యాడ్మింటన్ పోటీలు జరిగాయి. ఇందులో అండర్-14 విభాగంలో ఇవాంజలి ప్రతిభ చూపి బంగారు పతకంలో పాటు పురస్కార పత్రాన్ని అందుకుంది. ఈ సందర్భంగా ఆ విద్యార్థినిని పాఠశాల ప్రధానోపాధ్యాయులు వెంకటేశ్వరరావు, పిఈటి కె.ప్రసాద్ అభినందించారు.

# క్రీడలతోనే ఆరోగ్యం

## శ్రీకాకుళం శాసనసభ్యులు ధర్మాన ప్రసాదరావు



శ్రీకాకుళం: క్రీడలతోనే ఆరోగ్యం లభిస్తుందని, కావున ప్రతీ ఒక్కరూ క్రీడలపై మక్కువ పెంచుకోవాలని మాజీ మంత్రి మరియు శ్రీకాకుళం శాసనసభ్యులు ధర్మాన ప్రసాదరావు పేర్కొన్నారు. శనివారం ఉదయం 5వ ఆంధ్ర రాష్ట్ర శీతాకాల అంతర్ జిల్లా సబ్ జూనియర్ మరియు జూనియర్ స్థాయి స్విమ్మింగ్ పోటీలు స్థానిక శాంతినగర్ కాలనీలో గల డియస్ఏ స్విమ్మింగ్‌పూల్‌లో ప్రారంభమయ్యాయి. ఈ కార్యక్రమానికి శాసనసభ్యులు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం క్రీడలకు పెద్దపీట వేస్తుందని చెప్పారు. రాష్ట్ర, జిల్లా స్థాయిలో క్రీడాకారులను ప్రోత్సహించేందుకు దేశంలో ఏ రాష్ట్రంలో లేనివిధంగా ప్రోత్సాహకాలను రాష్ట్రప్రభుత్వం ప్రకటించిన సంగతిని ఆయన గుర్తుచేసారు. క్రీడలను, క్రీడాకారులను ప్రోత్సహించేందుకు ప్రభుత్వంతో పాటు పారిశ్రామిక వేత్తలు, దాతలు ముందుకురావాలని పిలుపునిచ్చారు. పిల్లలను అతిగారాబం చేస్తున్న తల్లితండ్రులు ఆటలకు చేరువ చేయాలని సూచించారు. తద్వారా చిన్నవయసు నుండే ఆరోగ్యం, మానసిక ఉల్లాసం లభిస్తుందని పేర్కొన్నారు. కావున తల్లితండ్రులు తమ పిల్లలకు ఆటలు, క్రీడలపై మక్కువపెంచేదిశగా కృషిచేయాలని కోరారు. తొలుత 5వ ఆంధ్రరాష్ట్ర శీతాకాల అంతర్ జిల్లా సబ్ జూనియర్ మరియు జూనియర్ స్థాయి స్విమ్మింగ్ పోటీలకు బెలూన్లు, పావురాలను వదిలి, 50 మీటర్ల బ్యాక్ స్ట్రోక్ స్విమ్మింగ్ పోటీలను ప్రారంభించారు. అనంతరం వివిధ జిల్లాలలో నిర్వహించిన క్రీడలలో గెలుపొందిన క్రీడాకారులకు జ్ఞాపికలను అందజేసి అభినందించారు.

జిల్లా కలెక్టర్ జె.నివాస్ మాట్లాడుతూ దేశంలో ఏ రాష్ట్రంలో లేనివిధంగా మన రాష్ట్రంలోక్రీడాకారులను ప్రోత్సహించడం జరుగుతుందన్నారు. అదేవిధంగా ఎక్కడా లేనివిధంగా క్రీడాకారుల కోటాను రాష్ట్రస్థాయిలో అమలుచేస్తొన్న సంగతిని కలెక్టర్ ఈ సందర్భంగా గుర్తుచేసారు. క్రీడాకారులకు లభించే 3 శాతం కోటాను జిల్లాలో పక్కాగా అమలు చేస్తున్నట్లు కలెక్టర్ చెప్పారు. ఇటీవలే గ్రామ సచివాలయ పోస్టుల నియామకంలో క్రీడాకారుల కోటాను అమలుచేసామని, అయితే 50 శాతం మంది క్రీడాకారుల కోటా మిగిలిఉండటంతో జనరల్ కోటాలో నియామకం చేపట్టిన సంగతిని కలెక్టర్ గుర్తుచేసారు. జిల్లాలో క్రీడాకారులకు కొదవలేదని, జాతీయ, అంతర్జాతీయ క్రీడాకారులు ఈ గడ్డమీదవారేనని, వారిని స్ఫూర్తిగా తీసుకొని ప్రతీ ఒక్కరూ క్రీడలపై మక్కువ పెంచుకోవాలని సూచించారు. అనంతరం శాసనసభ్యులతో కలిసి క్రీడలను ప్రారంభించి, క్రీడాకారులకు జ్ఞాపికలను అందజేసారు. ఈ కార్యక్రమంలో శ్రీకాకుళం పురపాలక సంఘం మాజీ ఛైర్‌పర్సన్లు మెంటాడ వెంకట పద్మావతి, అంధవరపు వరాహ నరసింహం (వరం), జిల్లా చీఫ్ కోచ్ బి. శ్రీనివాసకుమార్, రాజీవ్ విద్యామిషన్ ప్రాజెక్ట్ అధికారి పైడి వెంకటరమణ, కె.యన్.యస్.వి. ప్రసాద్, కొరాడ సర్వేశ్వరరావు, ఇతర అధికారులు, క్రీడాకారులు, తల్లితండ్రులు తదితరులు పాల్గొన్నారు.

## కేంద్రీయ విద్యాలయ ప్రగతిశీల శిక్షక్ సంఘ్ 4వ రీజనల్ కన్వెన్షన్




విశాఖపట్నం: కేంద్రీయ విద్యాలయ ప్రగతిశీల శిక్షక్ సంఘ్ యొక్క 4వ రీజనల్ కన్వెన్షన్ విశాఖపట్నంలోని కేంద్రీయ విద్యాలయం, వాల్తేరు నందు శనివారం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా కేంద్రీయ విద్యాలయ సంగఠన్, హైదరాబాద్ క్షత్ర డిప్యూటీ కమీషనర్ పి.వి.సాయి రంగారావు , గౌరవ అతిధిగా సుమిదా దేవి, ఐ.ఆర్.ఎస్. అడిషనల్ సెక్రటరీ, నేషనల్ ఎకాడమీ ఆఫ్ కస్టమ్స్, వైజాగ్ విచ్చేసారు. సమావేశానికి సూర్యప్రకాష్, కె.వి.పి.ఎస్.ఎస్. ఆల్ ఇండియా ప్రెసిడెంట్, ప్రియావత్ చిక్కారా, కె.వి.పి.ఎస్.ఎస్. ఆల్ ఇండియా జనరల్ సెక్రటరీ, ఎస్.ఎస్.రాజా, ప్రిన్సిపల్, కే.వి., వాల్తేరు, కె.వి.డి. ప్రసాద్, ఎక్స్-ఆల్ ఇండియా ప్రెసిడెంట్, ఏఐకెవిటిఎ మరియు వివిధ కేంద్రీయ విద్యాలయాల నుండి 95 మంది అధ్యాపకులు హాజరైనారు. కార్యక్రమము దీప ప్రజ్వలన మరియు కే.వి. వాల్తేరు విద్యార్థుల ప్రార్ధనతో ప్రారంభమైంది. హైదరాబాద్ రీజనల్ ప్రెసిడెంట్ చంద్రశేఖర రెడ్డి అతిధులకు స్వాగతం పలికారు.

రీజనల్ సెక్రటరీ రంగాచార్యులు మాట్లాడుతూ కేంద్రీయ విద్యాలయ సంగఠన్ నందు అన్ని యూనియన్‌లలో హైదరాబాద్ రీజన్ ముందు ఉన్నది అని తెలియజేసారు. వివిధ కార్యక్రమాలను విద్యాలయం నందు ప్రవేశపెట్టడం వలన విద్యా ప్రమాణాలు మరియు నాణ్యత తగ్గిపోతుందని అన్నారు. సుమిదా దేవి, ఐఆర్ఎస్, అడిషనల్ సెక్రటరీ, నేషనల్ అకాడమీ ఆఫ్ కస్టమ్స్, వైజాగ్ మాట్లాడుతూ తను కేంద్రీయ విద్యాలయ పూర్వ విద్యార్థిని అని గుర్తు తెచ్చుకుంటూ విద్యార్థులు అనేక సామాజిక కారణాల వల్ల విద్యపట్ల ఆసక్తిని, క్రమశిక్షణ చూపట్లేదని అన్నారు.

కె.వి.డి.ప్రసాద్, ఎక్స్-ఆల్ ఇండియా ప్రెసిడెంట్, ఏఐకెవిటిఎ మాట్లాడుతూ అధ్యాపకుల సమస్యలను అధికారుల వరకు తీసుకెళ్ళాలని అప్పుడు మాత్రమే పరిష్కారాలు దొరుకుతాయని అన్నారు.

సూర్యప్రకాష్, కెవిపిఎస్ఎస్ ఆల్ ఇండియా ప్రెసిడెంట్ మాట్లాడుతూ సభ్యులతోనే యూనియన్ శక్తిశాలిగా మారుతుందని కావున అందరూ సభ్యులుగా జేరి యూనియన్ బలాన్ని పెంచాలని అన్నారు. పార్లమెంటులో అధ్యాపకుల సమస్యల గురించి ప్రశ్నోత్తరాల ద్వారా పరిష్కార మార్గాలు పొందడానికి ప్రతి ఒక్కరి తమ తమ పార్లమెంటు సభ్యులను కలవాలని కోరారు.

ప్రియావత్ చిక్కారా, కెవిపిఎస్ఎస్ ఆల్ ఇండియా జనరల్ సెక్రటరీ కెవిపిఎస్ఎస్ ద్వారా జరుగుతున్న కార్యక్రమాలు, సాధించిన విజయాలు తెలియజేసారు. భవిష్యత్తు కార్యాచరణను ప్రకటించారు.

ముఖ్య అతిధి పి.వి.రంగారావు, డిప్యూటీ కమీషనర్, కె.వి.ఎస్. (హెచ్.ఆర్) మాట్లాడుతూ కేంద్రీయ విద్యాలయ శిక్షకులు మాట్లాడుతూ అధ్యాపకుల అకుంఠిత దీక్ష మరియు నిర్విరామ శ్రమ వలనే కేంద్రీయ విద్యాలయ సంగఠన్ అత్యున్నత శిఖరాలను అధిరోహిస్తోందని అన్నారు.

## జివిఎంసి ఎన్నికలు వెంటనే నిర్వహించాలి

విశాఖపట్నం: హైకోర్టు తీర్పును అనుసరించి రాష్ట్రప్రభుత్వం వెంటనే స్పందించి గ్రేటర్ విశాఖ మున్సిపాల్ కార్పొరేషన్ కి ఎన్నికలు నిర్వహించాలని భారత కమ్యూనిస్టుపార్టీ (మార్క్సిస్టు) గ్రేటర్ విశాఖ నగర కమిటీ డిమాండ్ చేస్తుంది. గత ప్రభుత్వం అవకాశవాదంతో గ్రేటర్ విశాఖ మున్సిపల్ కార్పొరేషన్‌కి గత 7 సం॥రాల నుండి ఎన్నికలు జరగనివ్వలేదు. ఈదే సమయంలో గ్రేటర్ విశాఖ మున్సిపల్ కార్పొరేషన్ కోట్లాది రూపాయిలు నిధులు ఎటువంటి కౌన్సిల్ ప్రతిపాదన లేకుండానే అప్రజాస్వామిక నిర్ణయాలతో వృదా చేశారు.

## 99వ స్వచ్ఛ బ్రాండిక్స్



అచ్యుతాపురం : బ్రాండిక్స్ భారత బాగస్వామి దొరస్వామి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న స్వచ్ఛ బ్రాండిక్స్ కార్యక్రమంలో బాగంగా శనివారం 99 వ స్వచ్ఛ బ్రాండిక్స్ కార్యక్రమంలో హౌస్ కీపింగ్ స్టాఫ్ సహా కొద్దిపాటి ఉద్యోగులు పాల్గొని మెయిన్ గేట్ ముందు చెత్తను, పిచ్చి మొక్కలను తొలగించారు. ప్రతి ఒక్కరూ తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని దొరస్వామి పిలుపు నిచ్చారు.

# పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత



న్యూఢిల్లీ : పర్యావరణ పరిరక్షణ ప్రజలందరి బాధ్యతగా తీసుకోవాలని ఢిల్లీ ఆంధ్రాభవన్‌లో జరిగిన ఇండియన్ ఎన్విరాన్‌మెంట్ సమ్మిట్‌లో కాకినాడ పార్లమెంట్

## మార్కెట్‌లోకి నాన్ పాలిథిన్ గ్రీన్ కవర్లు

సభ్యురాలు వంగా గీత అన్నారు. వే ఫౌండేషన్, నేచర్ కేర్ సర్వీసెస్ సంయుక్తంగా ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమాన్ని పార్లమెంట్ సభ్యులు వంగా గీత, అరకు ఎంపీ గొడ్డేటి మాధవి, హిందూపూర్ ఎంపీ గోరంట్ల మాధవ్ జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభించారు. పార్లమెంట్ సభ్యులు గొడ్డేటి మాధవి మాట్లాడుతూ రాష్ట్ర పర్యా టక రాజధానిగా అభివృద్ధి చెందు తున్న అరకు నాన్ ప్లాస్టిక్ జోన్‌గా తయారుచేస్తామన్నారు. పర్యాట కులు పాలిథిన్ కవర్లు, వాటర్ బాటిళ్ళు వినియోగించవద్దు అన్నారు. హిందూపూర్ ఎంపీ గోరంట్ల మాధవ్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ మొక్కలు నాటే కార్యక్రమం తమ పరిసర ప్రాంతాల్లో చేపట్టాలి అన్నారు. కాలుష్యరహిత సమాజం కోసం సమిష్టిగా కృషి చేద్దాం అన్నారు. అనంతరం నేచర్ కేర్ సర్వీసెస్ తాయరుచేసిన నాన్ పాలిథిన్ గ్రీన్ కవర్లును పార్లమెంట్ సభ్యులు విడుదల చేశారు. ఈ కవర్లు చెరకు, శ్యామ్ దుంపలు, సగ్గుబియ్యం, వివిధ రకాల కూరగాయలతో తయారు చేసినట్లు నేచర్ కేర్ సర్వీసెస్ సంస్థ అధినేత బి.విజయ్‌కుమార్ రెడ్డి అన్నారు. కవర్లు వినియోగించిన తరువాత వేడి నీటి ద్వారా డైల్యూట్ చేయవచ్చుఅని ప్రజెంటేషన్‌లో చూపించారు. అనంతరం వివిధ రాష్ట్రాల నుండి వచ్చిన సోషల్ వర్కర్లుకు ఎన్విరాన్‌మెంట్ ఎక్సలెన్స్ అవార్డులు ముఖ్య అతిధులు ద్వారా వే ఫౌండేషన్ వ్యవస్థాపకులు గంటా స్వామి అందజేశారు.



## యు వి రావ్ కు ఘన స్వాగతం



గాజువాక: పారిశ్రామిక ప్రాంతం సింధియా హిందుస్థాన్ షిప్ యార్డ్ మాజీ సొసైటీ - ఉద్యోగి ఉప్పిని వలస వెంకటేశ్వరరావు ( యువి రావ్) డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ నేషనల్ ఫెలోషిప్ అవార్డ అందుకని తిరిగి శనివారం విశాఖ రైల్వే స్టేషన్ కి చేరిన ఆయనకు పూలమాలవేసి పుష్పగుచ్ఛం తో జై భీం బాక్సింగ్ క్లబ్ క్రీడాకారులు ఘన స్వాగతం పలికారు.

దేశ రాజధాని న్యూఢిల్లీలో జరిగిన నేషనల్ కాన్ఫరెన్స్ లో సాహిత్య అకాడమీ ( న్యూఢిల్లీ) జాతీయ అధ్యక్షులు డాక్టర్. ఎస్.పి. సుమనఅక్షర్ న త్క రి ం చ న త్క రి ం చి, పురస్కారం ఇచ్చినట్టు పేర్కొన్నారు. ఈ సందర్భంగా అవార్డు గ్రహీత యు వి రావు మాట్లాడుతూ ఈసదస్సులో దేశం లో అస్సాం, మిజోరాం, శ్రీలంక, భూటాన్, నేపాల్, యూఏఈ నుంచి కూడా పలువురు ప్రొఫెసర్లకు, అధికారులకు, సంఘసంస్కర్తలకు ఎస్సీ, ఎస్టీ , బీసీ, మైనార్టీలకు

విశిష్ట సేవా పురస్కారాలను అందించినట్లు పేర్కొన్నారు. అంబేద్కర్ ఆశయ సాధనకు తనవంతు కృషి చేస్తానని, తనను ప్రోత్సహించిన భీమ్ సేన, ఎన్.ఎస్.ఎఫ్ .జే, షిప్యార్డ్ గుర్తింపు యూనియన్, షిప్యార్డ్, హెచ్పిసిఎల్, స్టీల్ ప్లాంట్, బీహెచ్ఈఎల్

ఎస్సీ ఎస్టీ సెల్, పాత్రికేయులకు, ప్రతి ఒక్కరికి ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలను తెలిపారు. స్వాగతం పలికినవారిలో జై భీమ్ బాక్సింగ్ క్లబ్ క్రీడాకారులు తదితరులు పాల్గున్నారు.

## పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన అవంతీ



భీమునిపట్నం: భీమిలి నియోజకవర్గం లో భీమిలి,ఆనందపురం మండలాలలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి ముత్తంశెట్టి.శ్రీనివాసరావు ముందుగా మంత్రి ఆనందపురం మండలం తర్లువాడ, ఎల్.వి పాలెం, చందక గ్రామాలలో గ్రామ సచివాలయం భవనాలకు శంకుస్థాపన చేశారు అనంతరం భీమిలి రూరల్ మండలం చిప్పాడ పంచాయతీలో దీవిస్ వారి సహకారంతో 18 గ్రామాలకు 7 కోట్ల 25 లక్షల రూపాయలతో ఏర్పాటుచేసిన సమగ్ర మంచినీటి సరఫరా పథకంను ప్రారంభించారు. అనంతరం అన్నవరం,అమనాం గ్రామపంచాయతీలో గ్రామ సచివాలయ భవనాలకు శంకుసాపన చేశారు.ఈ కార్యక్రమంలో భీమిలి ఎం.ఆర్.ఓ.ఈశ్వరరావు,డి.ఎల్.డి.చైర్మన్ గాడు .వెంకటప్పడు, దీవిస్ రిపర్జెంటివ్స్ వై.ఎన్.కోటేశ్వరరావు,ఎం.ఎన్.వరహాలరెడ్డి ,పి.శ్రీనివాస్,ఇ.శ్రీనాగరాజు, ఆనందపురం భీమిలి రూరల్ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

## రాష్ట్రస్థాయి పోటీలకు ఉషోదయ విద్యార్థులు

చోడవరం : ఇటీవల నిర్వహించిన జిల్లా స్థాయి జూనియర్ కళాశాలల క్రీడా పోటీలలో ఉషోదయ విద్యార్థులు పలు పతకాలను సాధించి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు ఉషోదయ విద్యా సంస్థల ఛైర్మన్ జెర్రిపోతుల నానాజీ తెలిపారు. వాలీబాల్ పోటీలలో గెమ్మిలి అప్పన్న, కబడ్డీ పోటీలలో కోన యుగంధర్, జనపరెడ్డిమదన్ జిల్లాస్థాయి పోటీలలో ఉత్తమ ప్రతిభకనబరచి రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యారన్నారు. ఈ సందర్భంగా శనివారం క్రీడా కారులను అభినందించారు. ఈ కార్యక్రమంలో కరస్పాండెంట్ జె.కృష్ణకుమారి, డీన్ ఎస్.వి. వాసు, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ వి.ఎస్.ఎస్.అప్పారావు, వైస్ ప్రిన్సిపాల్ రామారావు, పి.డి.రామ్ కుమార్, సిబ్బంది విజేతలను అభినందించారు.



క్రీడాకారులను అభినందిస్తున్న ఉషోదయ విద్యా సంస్థల ఛైర్మన్ జె.రమణాజీ

# విజయభాను సంపాదకీయం

## కన్సర్వేటివ్‌కే పట్టం

బ్రిటన్‌లో జరిగిన చరిత్రాత్మక ఎన్నికలలో ప్రజలు యురోపియన్ యూనియన్ నుంచి వైదొలుగాలంటూ నిక్కచ్చిగా చెబుతున్న ప్రధాని బోరిస్ జాన్సన్ నాయకత్వంలోని కన్సర్వేటివ్ పార్టీకే అధికారం కట్టబెట్టారు. 650 సీట్లున్న పార్లమెంటులో కన్సర్వేటివ్ పార్టీ సగానికి మించి 360కి పైగా స్థానాలను గెలుచుకున్నది. యురోపియన్ యూనియన్ నుంచి వైదొలుగాలని (బ్రెగ్జిట్) 2016 రెఫరెండంలోనే ప్రజలు తీర్పునిచ్చారు. కన్సర్వేటివ్స్‌తో సహా పార్లమెంటు సభ్యులు తిరకాసులు పెడుతూ ఈయూతో తెగతెంపులు అమలుకాకుండా అడ్డుకుంటున్నారు. బ్రెగ్జిట్‌పై మరోసారి రెఫరెండం జరుపాలనే వరకు పోయింది వీరి వ్యవహారం. గత ప్రధాని థెరీసా మే ఈయూతో ఎడబా టు ఒప్పందం కుదుర్చున్నంక కూడా ఆమె ముసాయిదాలను పార్లమెంటు తిరస్కరిస్తూ పోయింది. ఆమె స్థానంలో ప్రధాని అయిన బోరిస్ జాన్సన్ కూడా ఇదే అనిశ్చితిని ఎదుర్కొని, తెగించి మధ్యంతర ప్రజా తీర్పుకు సిద్ధమయ్యారు. ప్రజల ప్రయోజనాలు, మనోభావాల కన్నా వ్యాపార ప్రయోజనాలకే ప్రాధాన్యం ఇచ్చిన పార్లమెంటు సభ్యుల మూలంగానే జాన్సన్ ప్రజాతీర్పు కోరవలసి వచ్చింది. ప్రజలు బ్రెగ్జిట్‌కు అనుకూలంగా స్పష్టమైన తీర్పు ఇచ్చినందువల్ల ఇప్పుడిక పార్లమెంటు సభ్యులు అడ్డుకునే సాహసం చేయలేరు. ఇక ఏ మాత్రం సంకోచం లేకుండా వచ్చే నెల చివరికల్లా ఈయూ నుంచి వైదొలుగడమేనని జాన్సన్ తన విజయోత్సవ ప్రసంగంలో స్పష్టం చేశారు. ఈ ఎన్నికలలో లేబర్ పార్టీ తమ బలమైన స్థానాలలో కుప్పకూలింది. ఇంగ్లండ్, వేల్స్‌లోని కార్మికవర్గం లేబర్ పార్టీని వీడి కన్సర్వేటివ్స్‌కు మద్దతునివ్వడం గమనార్హం. 2008 ఆర్థిక సంక్షోభం తర్వా త అమెరికాతో సహా ప్రపంచవ్యాప్తంగా రాజకీ య చిత్రంలో మార్పు కనిపిస్తున్నది. ఈ పరిణా మం బ్రిటన్‌కు విస్తరించింది. ఈయూ నుంచి బయటకు రావాలని ఇంగ్లిష్ ప్రజలు ఇంత పట్టుదలగా ఉండటంలో తప్పేమీ లేదు. ప్రజల సంక్షేమం గురించి దేశ పాలకులు పట్టించుకోవాలె. ఇందులో ఆర్థికవిధానాలు ప్రధానమైనవి. కానీ ఆర్థిక విధానాలపై దేశ పార్లమెంటుకు అధికారాలు లేకుండా పోయాయి. శతాబ్దాలుగా ప్రజలు పోరాడి రూపొందించుకున్న ప్రజాస్వామిక, పార్లమెంటరీ విధానాలు ప్రపంచీకరణ పేర నిర్వీర్యమైపోయాయి. బ్రిటన్ పార్లమెంటు నిస్సహాయంగా చూస్తుంటే, యురోపియన్ కమిషన్, యురోపియన్ సెంట్రల్ బ్యాంక్, ఐఎంఎఫ్ ఇంగ్లాండ్ ప్రజల బతుకులను నిర్ణయిస్తాయి. పార్లమెంటరీ ప్రజాస్వామ్యానికి పాదుకొల్పిన ఇంగ్లండ్ ప్రజలు ఈ దుస్థితిని జీర్ణించుకో లేకపోతున్నారు. 1990 దశకం చివరి నుంచి- ఆటల పోటీలను చూస్తున్నప్పుడు ఇంగ్లిష్ ప్రజలు ఒకప్పటి మాదిరిగా మొత్తం దేశానికి సంకేతమైన యూనియన్ జాక్‌ను కాకుండా ఒకప్పటి ఇంగ్లిష్ రాజ్యానికి పతాకమైన రెడ్ క్రాస్ జెండాను ఊపడం వారి జాత్యభిమానాన్ని సూచిస్తున్నది. ప్రజల సంక్షేమానికి కోత పెట్టడం, పారిశ్రామిక సంస్థలకు పన్ను రాయితీలు ఇవ్వడం అన్నిదేశాల్లో సాధారణమైపోయాయి. ప్రజలు ఆందోళనలకు దిగుతుంటే ప్రభుత్వాలు అణిచివేయడం మినహా మరే అధికారాలు లేని దుస్థితి ఏర్పడ్డది. ఇంగ్లిష్ ప్రజల పరిస్థితిని ప్రపంచవ్యాప్త పోకడలో భాగంగా అర్థం చేసుకోవాలె. లేబర్ పార్టీ ఈ ఎన్నికల ఫలితాల మూలంగా 1935 తర్వాత ఎన్నడూ లేనంత అత్యంత అధ్వాన్న స్థితికి దిగజారింది. లేబర్ పార్టీ నాయకుడు కార్బిన్ వామపక్ష స్వభావం గల ఎన్నికల మ్యానిఫెస్టోతో ప్రచారానికి వెళ్లారు. సంక్షేమ పథకాలకు భారీగా కేటాయిస్తామని, కీలక పరిశ్రమలను జాతీయం చేస్తామ ని వాగ్దానం చేశారు. కానీ బ్రెగ్జిట్ విషయంలో తటపటాయింపును ప్రదర్శించారు. ప్రజల మనోభావాలను పట్టించుకోకపోవడం, విశ్వసనీయత కోల్పోవడం ఓటమికి ఒక కారణం. ఆర్థిక విధానాల్లో సమగ్రమైన దృక్పథాన్ని ప్రదర్శించి ప్రజలకు చేరవేయకుండా, ఇప్పుడున్న చట్రంలోనే సంక్షేమ పథకాలను, జాతీయీ కరణను అమలు చేస్తామనడం ప్రజలను ఆకట్టుకోలేక పోయింది. ప్రజల సంక్షేమం కోసం కేటాయింపు పెంచుతామని ప్రధాని జాన్సన్ ఎన్నికల సందర్భంగా ప్రకటిం చారు. అయితే ఇంగ్లిష్ ప్రజలు జాత్యభిమానం ప్రదర్శిం చడంతో పాటు అందులో తమకు మేలుచేసే ఆర్థికవిధానా లను తాము చేపట్టాలనే అంతరార్థం కూడా ప్రజా తీర్పులో దాగి ఉన్నది. ప్రధాని జాన్సన్ బ్రెగ్జిట్ అనంతర కాలంలో అమెరికాతో వాణిజ్య ఒప్పందంతో సరిపెట్టు కోకుండా ప్రజాకేంద్ర ఆర్థికవిధానాలను అనుసరిస్తే, ఇతర దేశాలకు మార్గం చూపినవారవుతారు. యూకేలోని నాలుగు ప్రాంతాల్లో ఒకటైన ఇంగ్లండ్ తీర్పు బ్రెగ్జిట్‌కు అనుకూలంగా ఉన్నది. కానీ మిగతా ప్రాంతాల ప్రజాభిప్రాయం కూడా గమనించదగినది.

# వైదిక ధర్మాన్ని విశ్వవ్యాప్తం చేయడమే నా యాత్ర లక్ష్యం




ప్రొద్దుటూరు : భారతీయ సనాతన వె%దిక ధర్మాన్ని విశ్వవ్యాప్తం చేయడమే తన హిందూ ధర్మ ప్రచార యాత్ర లక్ష్యమని చెప్పారు విశాఖ శారదా పీఠం ఉత్తరాధికారి స్వామి స్వాత్మానందేంద్ర. మూడు రోజులుగా కడప జిల్లాలో సాగుతున్న యాత్ర శనివారం ప్రొద్దుటూరు, చాపాడు, పోరుమామిళ్ళ, కడప సిటీ పరిధిలోకొచ్చే పాతకడప, దేవుని కడప, చెన్నూరు ప్రాంతాల్లో నిర్వహించారు. స్వామీజీ యాత్రకు భక్తులు అడుగడుగునా బ్రహ్మరథం పట్టారు. హిందూ ధర్మాన్ని ప్రబోధిస్తూ స్వామీజీ తన యాత్రను సాగించారు. చాపాడు మండల పరిధిలోకొచ్చే అల్లాడుపల్లె దేవళాలు పుణ్యక్షేత్రాన్ని సందర్శించి వీరభద్ర స్వామికి ప్రత్యేక పూజలు



చేశారు. అక్కడ నుంచి మాధవరం వెళ్లి కొండారెడ్డి శ్రీచైతన్య స్కూలును సందర్శించారు. తిరిగి కడప నగరంలోని శ్రీహరి డిగ్రీ కాలేజీకి వెళ్లి విద్యార్థులకు అనుగ్రహ భాషణం చేశారు. హిందూ ధర్మం యొక్క ఔన్నత్యాన్ని విద్యార్థులకు వివరించారు. ఆధ్యాత్మిక చింతనకు - ఆత్మవిశ్వాసానికి మధ్య అనుబంధాన్ని విద్యార్థులకు విపులంగా వివరించారు. పోటీ ప్రపంచంలో దూసుకుపోవాలంటే ఆత్మ విశ్వాసం ముఖ్యమని, అది కావాలంటే ఆధ్యాత్మిక భావం పెంపొందించుకోవాలని విద్యార్థులకు హితవు చెప్పారు. విద్యార్థి జీవితాల్లో ఇతరత్రా ఆలోచనలు చేయొద్దని సూచించారు. అనంతరం హిందూ ధర్మ ప్రచార యాత్ర సమన్వయకర్త శివ భారత్ రెడ్డి నివాసానికి వెళ్ళారు. అక్కడే ఉన్న మెడికల్ డిస్పెన్సరీని పరిశీలించారు. రోగులకు, వైద్యులకు, వైద్య సిబ్బందికి ఆశీస్సులు అందజేశారు. అనంతరం పాత కడపలోని సోమేశ్వర ఆలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు చేసారు. తిరుమల తొలి గడపగా పేరున్న దేవుని కడప గ్రామానికి వెళ్లి లక్ష్మీ వెంకటేశ్వరస్వామిని దర్శించుకున్నారు. టిటిడి పరిధిలోకొచ్చే ఈ ఆలయంలో అధికారులు స్వామీజీకి మర్యాదపూర్వకంగా స్వాగతం పలికారు

విజయవంతంగా హిందూ ధర్మ ప్రచార యాత్ర - స్వామి స్వాత్మానందేంద్ర

కడప నగర పరిధిలోని కన్యకాపరమేశ్వరి అమ్మవారి శాలను సందర్శించిన స్వామి స్వాత్మానందేంద్ర మీడియాతో మాట్లాడారు.తాను చేపట్టిన యాత్ర ఇప్పటివరకు 11 వేల కిలోమీటర్ల మేర సాగిందని చెప్పారు. భారతీయ సనాతన వైదిక ధర్మాలను ప్రచారం చేస్తుండటంతో యాత్రకు భక్తులు బ్రహ్మరథం పడుతున్నారని వివరించారు. తొలి విడతలో తెలుగు రాష్ట్రాలను పూర్తి చేసుకుని, ఆపై దక్షిణ, ఉత్తర భారతదేశమంతా యాత్ర సాగిస్తానని అన్నారు. యాత్ర దిక్కుగా సాగడానికి సహకరిస్తున్న ప్రతి ఒక్కరికి స్వామిజీ ధన్యవాదాలు తెలిపారు. యాత్రకు అన్ని వర్గాల నుంచి సహకారం ఉందన్నారు.

స్వామిజీ ఆశీస్సులు అందుకున్న ప్రముఖులు

హిందూ ధర్మప్రచార యాత్రలో భాగంగా కడప జిల్లాలో పర్యటిస్తున్న విశాఖ శారదా పీఠం ఉత్తరాధికారి స్వామి స్వాత్మానందేంద్రను పలువురు ప్రముఖులు కలిసి ఆశీస్సులు తీసుకున్నారు. ఉదయం ప్రొద్దుటూరులో మైదుకూరు ఎమ్మెల్యే రఘురామిరెడ్డి ఆహ్వానం మేరకు ఆయన నివాసానికి వెళ్లారు. ఎమ్మెల్యే కుటుంబ సభ్యులతో పాటు కడప ఎంపీ అవినాష్ రెడ్డి అక్కడ స్వామిజీ ఆశీస్సులు తీసుకున్నారు. అనంతరం చెన్నూరులో స్వామిజీ బస చేసిన గోసుల కన్వెన్షన్ సెంటర్ కు రాయచోటి ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్ రెడ్డి వచ్చి స్వామీజీ ఆశీస్సులు అందుకున్నారు. యాత్ర వివరాలను అడిగి తెలుసుకున్నారు. యాత్రలో స్వామిజీ వెంట హిందూ ధర్మ ప్రచార యాత్ర ఆంధ్రప్రదేశ్ సమన్వయకర్త గోసుల శివభారత్ రెడ్డి ఉన్నారు.



# విజేతలుగా ఎదగండి.. వ్యక్తిత్వం చాటుకోండి

**కలెక్టర్ జె.నివాస్ ఆకాంక్ష .. వేడుకగా ఆరంభమయిన రాష్ట్ర స్థాయి ఈత పోటీలు**

**ఆతిథ్య జిల్లాలో అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహణ**



శ్రీకాకుళం : నిరంతరం పరిశ్రమిస్తూ, తమని తాము తీర్చిదిద్దుకుంటూ ఎదిగిన వారే కాలానగుణంగా రాణించడమే కాక, చరిత్రలో నిలిచిపోయే స్థాయిలో ప్రముఖంగా పేరు తెచ్చుకుంటారని కలెక్టర్ జె.నివాస్ అన్నారు. స్థానిక శాంతి నగర్ లో కాలనీలో జిల్లా స్విమ్మింగ్ అసోసియేషన్ నేత ృత్వాన ఏర్పాటు చేసిన ఐదో రాష్ట్రస్థాయి పోటీలకు ఆత్మీయ అతిథిగా విచ్చేశారు. ఆయనతో పాటు మరో ఆత్మీయ అతిథిగా శ్రీకాకుళం శాసన సభ్యులు, సీనియర్ పొలిటీషియన్ ధర్మాన ప్రసాదరావు హాజరయ్యారు. వీరిని పోటీల నిర్వాహకులు, జిల్లా స్విమ్మింగ్ అసోసియేషన్ అధ్యక్షులు కేఎన్ఎస్వీ ప్రసాద్ (హారికా ప్రసాద్) ఆహ్వానించి, క్రీడాకారులను పరిచయం చేశారు. ఈ సందర్భంగా ప్రారంభోపన్యాసం చేసిన కలెక్టర్ .. క్రీడాకారులలు నైతికత పెంచుకోవడంతో పాటు సామాజిక బాధ్యతలను నిర్వహించేందుకు సైతం ముందుకు రావాలని అటువంటప్పుడే పౌర సమాజంలో మరింత ఉన్నతి సాధించడం సాధ్యమని అభిప్రాయపడ్డారు. కొన్ని ఒడిదొడుకులకు ఓర్చి ఈ పోటీలను అత్యంత సమర్థనీయ స్థాయిలో, ప్రశంసనీయ రీతిలో నిర్వహిస్తున్న జిల్లా స్విమ్మింగ్ అసోసియేషన్ ను ఎమ్మెల్యే ధర్మాన తో సహా ఇతర అతిథులు మెంటాడ వెంకట పద్మావతి, వైఎస్సార్సీపీ నాయకులు వరం, వైపీ సూర్యనారాయణ, చీఫ్ కోచ్ బి.శ్రీనివాసరావు అభినందించారు. ఈ పోటీలలో విజేతలుగా నిలిచిన వారు సౌత్ జోన్ పోటీలకు అర్హత సాధించిన వారు అవుతారని, అదేవిధంగా జిల్లాలో ప్రతిభ ఉండి, పేదరికం కారణంగా రాణించలేని స్థితిలో ఉన్న క్రీడాకారులను ఆదుకునేందు తామెన్నడూ ముందుంటామని అసోసియేషన్ అధ్యక్షులు కేఎన్ఎస్వీ ప్రసాద్ (హారికా ప్రసాద్) వెల్లడించారు. కార్యక్రమంలో భాగంగా తొలి రోజు పోటీలను కలెక్టర్ నివాస్ ఆరంభించారు. రెండ్రోజుల పాటు జరిగే ఈ పోటీలకు మీడియా కన్వీనర్ గా బహదూర్ బాషా వ్యవహరిస్తు న్నారని, అదేవిధంగా క్రీడాకారులకు భోజన, వసతి ఏర్పాట్లను తమ సభ్యులు పర్యవేక్షిస్తున్నారని అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ అబ్దుల్ షాజహాన్ తెలిపారు. కార్యక్రమంలో సీనియర్ పాత్రికేయులు కొంక్యాన వేణు, ఎస్జే నాయుడు, వివిధ క్రీడా సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

# మిరాకిల్ మినిస్ట్రీస్ క్రిస్మస్ వేడుకలు



విశాఖపట్నం : మిరాకిల్ మినిస్ట్రీస్ వారి క్రిస్మస్ వేడుకలు ఆంధ్రా యూనివర్సిటీ గ్రౌండ్ లో శామ్యూల్ కర్మోజి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మంత్రివర్యులు అవంతి శ్రీనివాస్ , వైసీపీ నగర అధ్యక్షులు వంశీకృష్ణ శ్రీనివాస్ , వీ ఏం ఆర్ డీ ఏ చైర్మన్ ద్రోణంరాజు శ్రీనివాస్ , తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త అక్కరమాని విజయనిర్మల , నార్త్ సమన్వయ కర్త కే కే రాజు , కోలా గురువులు , కొయ్య ప్రసాద్ రెడ్డి , హనుమంతు పాల్గొని క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమం దేవుని వాక్యం మరియు కీర్తనలు పాటలతో ఘనంగా నిర్వహించారు.

# మహా కుంభ మేళాకు భారీ ఏర్పాట్లు...

డెహ్రాడూన్: మహా కుంభ మేళాను భారీ స్థాయిలో నిర్వహించేందుకు ఉత్తరాఖండ్ రాష్ట్ర ప్రభుత్వం, కేంద్ర ప్రభుత్వం సన్నాహాలు చేస్తున్నాయి. 2021లో జరిగే ఈ ఉత్సవాల్లో పాల్గొనే భక్తులకు సకల సదుపాయాలు కల్పించేందుకు ప్రయత్నిస్తున్నాయి. ఉత్తరాఖండ్ మంత్రి మదన్ కౌశిక్ మాట్లాడుతూ హృషీకేశ్-హరిద్వార్ మధ్య జల రవాణా సాధ్యాసాధ్యాల గురించి పరిశీలిస్తున్నట్లు తెలిపారు. ఈ ప్రతిపాదనలపై కేంద్ర ప్రభుత్వంతో చర్చిస్తున్నట్లు, కేంద్ర ప్రభుత్వం కూడా తమను ప్రోత్సహిస్తున్నట్లు చెప్పారు. ఇటీవల ఉత్తర ప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్‌లో జరిగిన కుంభమేళాలో ప్రయాగ్‌రాజ్- వారణాసి మధ్య ఉచిత రవాణా సేవలు విజయవంతమైన విషయాన్ని గుర్తు చేస్తూ, అదే విధానాన్ని తమ రాష్ట్రంలో కూడా అమలు చేయాలని భావిస్తున్నామని చెప్పారు.

# నేడే కాపు పిక్నిక్

**ప్రజాప్రతినిధులకు సన్మానం .. ముఖ్య అతిథిగా మంత్రి అవంతి శ్రీనివాసరావు**




విశాఖపట్నం : కనివినీ ఎరుగని రీతిలో జిల్లా వ్యాప్తంగా ఉన్న కాపు కుటుంబసభ్యుంతా ఒకేచోట కలిసేలా ఈ నె 15న కాపు కుటుంబ సభ్య ఆత్మీయ కయిక నిర్వహిస్తున్నట్టు కాపుసేన గౌరవాధ్యక్షు బి.ఎన్.మూర్తి తెలియజేశారు. విశాఖలోని వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో ఆయన శనివారం విలేకరుతో మాట్లాడారు. కార్యక్రమానికి సంబంధించిన విశేషాను తెలియజేశారు. విశాఖ జిల్లా వ్యాప్తంగా ఉన్న కాపు, తెలగ, బలిజ, ఒంటరి, తూర్పుకాపు, మున్నూరు కాపు కుటుంబసభ్యుంతా ఈ కార్యక్రమానికి హాజరుకావొచ్చునన్నారు. విశాఖలోని కంబాకొండలో ఈ కార్యక్రమాన్ని పెద్ద ఎత్తున నిర్వహిస్తున్నట్టు వివరించారు. ఆరోజు ఉదయం 9 గంట నుంచి ఈ ఆత్మీయ కయిక ప్రారంభమవుతుందన్నారు. రాష్ట్ర పర్యాటక శాఖామాత్యు ముత్తంశెట్టి శ్రీనివాసరావుతో పాటు మాజీ మంత్రి గంటా శ్రీనివాసరావు, కాపు కార్పొరేషన్ చైర్మన్ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథుగా హాజరవుతారని చెప్పారు. అలాగే మంత్రి అవంతి శ్రీనివాసరావుతో పాటు కాపు జాతికి చెందిన పలువురు రాజకీయ ప్రముఖుకు సన్మానం ఉంటుందని చెప్పారు. అలాగే ఆట పోటీలు సాంస్కృతిక కార్యక్రమూ ఏర్పాటు చేశామన్నారు. ఇప్పటికే జిల్లావ్యాప్తంగా ఉన్న కాపు కుటుంబసభ్యుకు ఈ సమాచారం తెలియజేశామన్నారు. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లన్నీ చురుగ్గా సాగుతున్నాయని అన్నారు.

ఈ ఆత్మీయ కయికలో పాపంచుకునే కుటుం సభ్యుందరికీ ఉచిత ప్రవేశం కల్పిస్తున్నామన్నారు. వచ్చినవారందరికీ భోజనసదుపాయం కూడా ఏర్పాటు చేశామన్నారు. జిల్లాలోని కాపు జాతికి చెందిన వారందరూ కుటుంబ సమేతంగా హాజరై.. కార్యక్రమాన్ని విజయవంతం చేయాని, కాపు ఐక్యతను చాటాని కోరారు. ఈ కార్యక్రమంలో కాపు సేన అధ్యక్షుడు దాసరి రాధాకృష్ణ, లంకా భాస్కర్, చంద్రమౌళి, ఉమారాణి, విఠల్, సాయిక్ష్మి, ఉషాకిరణ్, కేదారి లక్ష్మి, మురళి, తదితరులు పాల్గొన్నారు.

# సమాజంలో క్షణక్షణానికో ఘోరం



విశాఖపట్నం : సమాజంలో క్షణ క్షణానికి - జరుగున్న ప్రమాద నేపథ్యంలో ప్రభుత్వా సుపత్రుల్లో ఎంతో నిష్ణాతు లైన వైద్యులు తమకున్న అనుభవంతో ఎంతో నేర్పు గా ఓర్పుగా క్షతగాత్రులను, అత్యవసర చికిత్సకు వచ్చే రోగులను పరీక్షిస్తూ వారిని కాపాడు తున్నారు. ఈ నేపథ్యంలో 2019 సీఎంఈ రివ్యూ డిస్కస్ ది ఎమర్జింగ్ ఎవిఎన్స్ ఇన్ క్రిటికల్ కేర్ మెడిసిన్ అంశంపై 14,15 తేదీల్లో ప్రముఖ హెూటల్లో సదస్సును ఐఎస్సిసిఎం ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సదస్సుకు వీఎంఆర్డీ ఛైర్మన్ ద్రోణంరాజు శ్రీనివాస్ ముఖ్య అతిధిగా విచ్చేసారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అత్యవసర పరిస్థితుల్లో వైద్యులు అందిస్తున్న సేవలు అభినందనీ యమన్నారు. ఈ సదస్సులో వివిధ విభాగాల వైద్యాధికారులు పాల్గొని తమ అమూల్యమైన సలహాలు సూచనలు అందచేసారు. అంతే కాకుండా ప్రస్తుతం ప్రజలను పట్టిపీడిస్తున్న వివిధ రకాల ఇన్ ఫెక్షన్లు, కిడ్నీ, డెంగ్యూ, మలేరియా తదితర ప్రాణాంతక వ్యాధులపై సుదీర్ఘ చర్చ నిర్వహించి నివారణోపాయానికి తీసుకోవాల్సిన చర్యలు వివరించారు. ఈ సదస్సులో సుమారు వైద్యులు పాల్గొన్నారు. కార్యక్రమంలో వైద్యులు టి మోహన్, ఎస్ మహరాజ్,

రోజుకి రూ. 25/- మాత్రమే Size 1x3 Minimum 7 days విజయభాను క్లాసిఫైడ్స్
సంప్రదించవలసిన ఫోన్ నెంబర్ : 2564353, 2569004

FINANCE
ఒన్లీ రిటైర్డ్ పెన్షనర్లకు మాత్రమే
రూ. 30వేల నుండి 3 లక్షల వరకు
విశాఖ నుండి విజయవాడ వరకు
మధ్యలో ఎక్కడైనా సరే స్పాట్ ఫైనాన్స్
(with A/c Pay) చేయబడును.
JK అసోసియేషన్ సర్వీసెస్
Govt. Reg. No. 136/2009 (నో బ్రోకర్స్)
93969 99669

### సచివాలయ నిర్మాణంనకు భూమి పూజ

గొలుగొండ : పాత మల్లం పేట గ్రామంలో గ్రామ సచివాలయ నిర్మాణం కోసం శుక్రవారం భూమి పూజ కార్యక్రమం నిర్వహించారు.

IN THE HONOURABLE COURT OF THE PRINCIPAL JUNIOR CIVIL JUDGE AT BHEEMUNIPATNAM.
O.S.69/2019

Between:
Andhra Bank, rep. by its Branch Manager,
Tagarapuvalasa Branch, Visakhapatnam District. ...Plaintiff
And:
Abdul Hameed ...Defendant

NOTICE TO THE DEFENDANT

To,
Abdul Hameed,
S/o. Abdul Khadar,
R/o. D.No.38-30-233,
Hussain Nagar,
Near Punjab Hotel,
Marripalem Post,
Visakhapatnam.

Please take notice that the above suit filed by the plaintiff against you is posted to service of summons to you and the case is posted to **10-01-2020** for your appearance before the Honourable court and objections by you if any.

Therefore we are hereby informed you to attend before the Honourable Principal Junior Civil Judge Court at Bheemunipatnam on **10-01-2020 at 10:30 A.M** by inperson or through your Advocate, failing which the matter will be proceeded ex-parte.

(By order of the court)
Sri.P.Venkateswara Rao,
Sri. B.A.Raju,
Sri.A.Sharad Kumar,
Advocates
Bheemunipatnam.



మండలంలో గల ములియగుడ జంక్షన్ (బొర్రా జంక్షన్)లో భారీ లారీ ఆగిపోవడంతో గ్రామంలో వాహనాల రాకపోకలకు అంతరాయం కలిగింది

## చెరువును శుద్ధి చేసి గట్టు తొలిగింపు

భీమునిపట్నం: చిల్లపేట పెద్ద చెరువులోకి సంతపేట నుండి వస్తున్న మురికి నీరు వెళ్ల కుండా కొంతమంది అడ్డువేశారు. చెరువు అంత మురికినీటితో నిండి 10 గ్రామాల ప్రజలుకి రోగాల బారిన పడుతున్నారని. ప్రజలు ఆరోగ్యంగా ఉండాలని శనివారం మురికినీరు వెళ్లడానికి ఎఫ్.డి.ఓ శ్రీనివాసరావు , జోనల్ కమిషనర్ గోవిందరావులు జోనల్ కార్యాలయం సిబ్బందితో చెరువును శుద్ధి చేసి గట్టు తొలిగించారు. ఈ కార్యక్రమంలో వైసిపి పట్టణ నాయకులు జె. ప్రసాద్, జీరు వెంకటరెడ్డి,అక్కరమాని మంగరాజు, జి.వి.రమణ, పందిరి విజయ్,జీరు సుజాత, తదితరులు పాల్గొన్నారు.

### చిన్న, మధ్య తరహా పాసింజర్ కార్ల కోసం కొత్త టైర్

విశాఖపట్నం : ప్రముఖ టైర్ సంస్థల్లో ఒకటైన విపెలిన్ ఇటీవల భారతదేశంలో విపెలిన్ ఎనర్జీ ఎక్స్ ఎమ్ 2ను ప్రవేశపెట్టింది. విస్తృతంగా, విజయవంతమైన విపెలిన్ ఎనర్జీ ఎక్స్ ఎమ్ 2 టైర్ల స్థానంలో వీటిని భర్తీ చేసింది. చివరి వరకు కూడా పనితీరు, భద్రతతో కూడిన టైర్ కోసం చూసే యువ ఇతర వినియోగదారులను లక్ష్యంగా చేసుకుని రూపుదిద్దుకున్న విషెలిన్ ఎనర్జీ ఎక్స్ ఎమ్ 2+ చిన్న మధ్య తరహా ప్యాసింజర్ కార్లకు అనువైన అమరిక, తడి రహదారులపై బ్రేకింగ్‌లో దాని మునిపటి తరాన్ని అధిగమింపజేసి అభివృద్ధి చేయబడును.

## జాతీయ లోక్ అదాలత్ ద్వారా సత్వర పరిష్కారం

### చోడవరం కోర్టు సీనియర్ సవిల్ జడ్జి పి.ఆర్.రాజీవ్




జాతీయలోక్ అదాలత్‌లో మాట్లాడుతున్న చోడవరం కోర్టు సీనియర్ సివిల్ జడ్జి పి.ఆర్.రాజీవ్

చోడవరం : జాతీయలోక్ అదాలత్ ద్వారా ఇరుపార్టీలకు సత్వర న్యాయం జరుగుతుందని చోడవరం కోర్టు సీనియర్ సివిల్ జడ్జి, మండల న్యాయ సేవాధికార సంస్థ ఛైర్మన్ పి.ఆర్.రాజీవ్ అన్నారు.పట్టణంలోని కోర్టు సముదాయంలో శనివారం జాతీయ లోక్ అదాలత్ నిర్వహించారు. ఈ సందర్భంగా కక్షీదారులకు న్యాయ విజ్ఞానం, జాతీయలోక్ అదాలత్ కార్యక్రమంపై న్యాయమూర్తులు వివరించారు. అనంతరం లోక్ అదాలత్ నిర్వహించారు. సుమారు 550 కేసులకుపైగా పరిష్కరించారు. ఈ కార్యక్రమంలో అడిసినల్ జూనియర్ సివిల్ జడ్జి పి.శ్రీనివాస్, బార్ అసోసియేషన్ అధ్యక్షులు పోతల ప్రకాష్ వివిధ ప్రాంతాలకు చెందిన కక్షిదారులు తదితరులు పాల్గొన్నారు.

# లోక్ అదాలత్ ద్వారా త్వరితగతిన న్యాయం పొందండి

### - జిల్లా ప్రధాన న్యాయమూర్తి బి.యస్.భానుమతి
### - రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ జె.కె.మహేశ్వరి



విశాఖపట్నం: వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జాతీయ లోక్ అదాలత్ ను శనివారం ఉదయం పదిగంటలకు ప్రారంభించారు. విశాఖ పట్నం జిల్లాలో సత్వర న్యాయం కక్షిదారులకు అందించ డానికి అధిక శాతం కేసులు రాజీ ద్వారా పరిస్కరించాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తితో పాటు జిల్లాలోని అందరు న్యాయ మూర్తులను ఆదేశించారు. అనంతరం జిల్లా ప్రధాన న్యాయమూర్తి బి.యస్.భాను మతి ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా 38 ప్రజాన్యాయ పీఠాలను (లోక్ అదాలత్ బెంచీలు) ఏర్పాటు చేసి కేసులను పరిష్కరించారు. ఈ బెంచీల ద్వారా వ్యయ ప్రయాస లేని సత్వర న్యాయం కక్షిదారులు పొందాలని సూచించారు. జిల్లా వ్యాప్తంగా నాలుగు వేలకు పై చిలుకు సివిల్, రాజీపడదగ్గ క్రిమినల్ కేసులు రాజీకి గుర్తించి వాటిని అదాలత్ బెంచీల ద్వారా పరిష్కరించ నున్నట్లు తెలిపారు. బార్ అసోసియేషన్ అధ్యక్షులు జి.యమ్.రెడ్డి, బార్ కార్యదర్శి అక్కోరమాని కొండబాబు, బార్ కౌన్సిల్ మెంబర్లు పి.నర్సింగరావు, యస్ కృష్ణమోహన్, కె.రామ జోగేశ్వర రావు, బైపా అరుణ్ కుమార్ కూడా వీడియో కాన్ఫరెన్స్ లో పాల్గొన్నారు. ఎక్కువ శాతం కేసుల పరిష్కారానికి న్యాయవాదులకి పిలుపునిచ్చారు. మన రాష్ట్రం లో విశాఖ జిల్లా కేసుల పరిష్కారంలో ప్రథమ స్థానంలో నిలిచే విధంగా సహకారం అందజేస్తాం అన్నారు. జిల్లా కోర్టు ప్రాంగణంలో కక్షిదారులు తాకిడి కేసులు పరిష్కా రానికి ఎక్కువ కనబడింది. ప్రధానంగా వాహన ప్రమాద కేసులలో లబ్దిదారులకి భీమా పరిహారం సత్వరంగా అదాలత్ ద్వారా అందించి వారిని ఆదుకోవడం వారు సంతోషించారు. గతంలో విశాఖ జిల్లా తొమ్మిది పర్యాయాలు జాతీయ లోక్ అదాలత్ లో రాష్ట్రం లో కేసుల పరిష్కారంలో విశాఖ జిల్లా ప్రథమ స్థానంలో నిలిచింది. ఈ లోక్ అదాలత్ లో కూడా విశాఖ జిల్లా ప్రథమ స్థానంలో కొనసాగుతున్నట్లు కడపటి సమాచారం. జిల్లా కోర్టు ప్రాంగణంలో పద్దెనిమిది బెంచీలు, మిగిలిన అదాలత్ బెంచీలు పదకొండు గ్రామీణ కోర్టుల ప్రాంగణాలలో మండల్ లీగల్ సర్వీసెస్ కమిటీ ల ద్వారా ఏర్పాటు చేసినట్లు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి సనపల దామోదర రావు తెలిపారు. కోర్టులలో చిరకాల పెండింగ్లో ఉన్న కేసులు పరిష్కారం అవడం గమనార్హం. కుటుంబం తగాదాల కేసులు, వాహనభీమా కేసులు, భూ సేకరణ కేసులు, చెక్కుల నిరాదరణ కేసులు, డిక్రీల అమలు వంటి తదితర కేసులు ప్రధానం గా రాజీలు అధిక శాతంగా జరిగింది. ఈ లోక్ అదాలత్ లో సివిల్ కేసులు, క్రిమినల్ కేసులు, ప్రమాద భీమా నష్ట పరిహారం కేసులు అన్ని కలిపి కేసులు పరిష్కారించి, కక్షిదారుల మధ్యలోమొత్తం సొమ్ము లావాదేవీలు జరిగినట్లు న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి యస్.దామోదరరావు, తెలిపారు. జాతీయ, రాష్ట్ర స్థాయి న్యాయ సేవాధికార సంస్థల ఆదేశానుసారం 2019 సంవత్సరంలో తుది జాతీయ లోక్ అదాలత్‌గా జిల్లా న్యాయ సేవాధికార సంస్థ అధ్యక్షులు బి.యస్.భానుమతి ఆధ్వర్యంలో నిర్వహించారు.

## విసిసి ట్యూషన్ టీచర్లకు గుడ్ టచ్ బ్యాడ్ టచ్ పైన శిక్షణ కార్యక్రమం




విశాఖపట్నం : కంచరపాలెం బిఎన్ఆర్ ఫౌండేషన్ ఆఫీసులో విసిసి ట్యూషన్ టీచర్లకు గుడ్ మరియు బ్యాడ్ టచ్ పైన జి.హరి వెంకట్, ప్రెసిడెంట్, విశాఖ ఫోరం ఫర్ చైల్డ్ రైట్స్ పైన శిక్షణ ఇచ్చారు. ముందుగా చిన్న చిన్న గీతల ద్వారా పిల్లలకు అర్థమయ్యే ఈ విధంగా ఎలా గీయాలో తెలియజేశారు. పిల్లలను విజిలెశిట్గా తయారు చేయటం, వారి శరీర భాగాలు పైన అవగాహన కల్పించడం చేయాలన్నారు. ఒకవేళ ప్రైవేట్ భాగాలు పైన టచ్ చేస్తే తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు తెలియ జేసే విధంగా వారికి భరోసా ఇవ్వాలి. అదీ చేయలేకపోతే 100 మరియు 1098 తెలియ జేయాలి. చాలామంది పిల్లలకు ఈ విషయాలు తెలియక అటువంటి వాటిని భరిస్తుంటారు. బెదిరించే వారి గురించి చెప్పరు.

ఇది వారి మానసిక ఆరోగ్యం దెబ్బతీయడమే కాదు, చదువుని దెబ్బ తీస్తుంది. ఆత్మహత్యలకు దారి తీస్తుంది. అనంతరం పోస్కో చట్టం, ఈ మధ్య కాలంలో జరుగుతున్న పరిణామాలు పైన చర్చించారు.

ఈ కార్యక్రమంలో నగరంలో పని చేస్తున్న 45 మంది టీచర్లు, విసిసి జోన్ కన్వీనర్లు సుశీల, పుష్ప, విమల, విజయలక్ష్మి, సుధ మొదలగువారు పాల్గొన్నారు.

# 16న గిరిజన సంఘం జిల్లా మహాసభలు

### గిరిజన సంఘం రాష్ట్ర నాయకులు కిల్లో సురేంద్ర

అనంతగిరి : అరకులోయ నియోజకవర్గం, హుకుంపేట, విశాఖ జిల్లా గిరిజన సంఘం ఏపీజిఎస్ జిల్లా మహాసభలు హుకుంపేటలో ఈ నెల 16 సోమవారం ఉటుందని,గిరిజన ప్రజలందరు పాల్గొవాలని పిలుపునిచ్చారు. పోడుభూములకు పట్టాల కోసం రైతులు పాల్గొవాలి. తారు రోడ్డు, సీసీరోడ్లు, కరెంట్, త్రాగునీరు వంటి సమస్యలతో పాటు 1/70చట్టం, పీసా, ఎల్‌టిఆర్ చట్టం, అటవీ హక్కుల చట్టం, జీవో నంబర్-3 అమలు తదితర అంశాల పై చర్చించి అమలుకు భవిష్యత్ పోరాటాలకు సన్నద్ధం కావటానికి ఉద్యమ కార్యాచరణ రూపొందించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు లక్ష్మణ్, కొండలరావు, రామారావు ,రమణ మూర్తి, చంద్రబాబు, సోమన్న, మల్లేష్, గాసన్న, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

# ఆకట్టుకున్న అన్నమాచార్య సంకీర్తన గానం




విశాఖపట్నం : అన్నమయ్య పదకోకిల పద్మశ్రీ డాక్టర్ శోభారాజ్ స్థాపించిన అన్నమాచార్య భావనా వాహిని విశాఖ నగర శాఖ ఆధ్వర్యంలో రామ్ నగర్ మెయిన్‌రోడ్డు దరి శ్రీ రాఘవేంద్ర స్వామి మఠంలో నిర్వహించిన అన్నమాచార్య సంకీర్తన గాత్రకచేరి ఆహూతులను ఆకట్టుకుంది. నగరానికి చెందిన ప్రముఖ గాయని కుమారి పి.ఇషిత అన్నమా చార్య సంకీర్తనలు ఆలపించి విచ్చేసిన భక్తజనుల మన్నన నలను పొందారు. అన్నమా చార్య సంకీర్తన కార్యక్రమానికి ప్రముఖ ఆధ్యాత్మికవేత్త ఎం.వి.రాజశేఖర్ వ్యాఖ్యాతగా వ్యవహరించారు. దీనికిముందు సామూహికంగా శ్రీ విష్ణు సహస్ర నామపారాయణం నిర్వహించినాము. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని కార్యక్రమాన్ని వీక్షించారు. ఈ కార్యక్రమంలో చాగంటి సత్సంఘం సభ్యులు, పి.ఎ.రామాచారి, ప్రోగ్రామ్ కన్వీనర్, ప్రముఖ ఆధ్యాత్మికవేత్త ఎం.వి.రాజశేఖర్, కో-కన్వీనర్లు జె.సోమయాజులు, భాస్కరరావు, మఠం మేనేజరు పవన్ కుమార్ ఆచార్య తదితరులు పాల్గొన్నారు.

## నిరుపేద వృద్ధులకు, వితంతువులకు ఉల్లిపాయలు ఉచితంగా సరఫరా




భీమునిపట్నం : పెరుగుతున్న ధరలు, పేద ప్రజలు పడుతున్న ఇబ్బందులు ద ృష్టిలో ఉంచుకుని నిరుపేద వ ృద్ధులకు, వితంతువులకు ఉల్లిపాయలు ఉచితంగా సరఫరా చేసినట్లు ఆలివర్ రాయి పౌండేషన్ అధ్యక్షుడు ఆలీవర్ రాయి తెలిపారు.భీమునిపట్నం గంట స్థంభం వేదికగా సుమారు రెండు వందల మందికి ఉచితంగా ఉల్లి పాయలు సరఫరా చేశారు.తమ సంస్థ ఆద్వర్యంలో భీమిలి నియోజకవర్గం లోని ఆనందపురం, పద్మనాభం, తగరపువలస ప్రాంతాలలో పేద ప్రజలకు, ఉల్లిపాయలు ఉచితంగా సరఫరా చేయనున్నట్లు తెలిపారు.రానున్న కాలంలో నిరు పేదలకు చేయూత ఇచ్చేందుకు మరిన్ని సేవాకార్యక్రమాలు చేపడతామని ఈ సందర్భంగా వివరించారు. ఈ కార్యక్రమంలో సంస్థ ప్రధినిదులు, సిబ్బంది పాల్గొన్నారు.

# ఘనంగా శ్రీ సత్యదేవుని ప్రాకారసేవ



అన్నవరం : తూ.గో.జిల్లా ప్రముఖ పుణ్యక్షేత్రము అన్నవరం రత్నగిరి వాసుడైన శ్రీ వీరవేంకట సత్యనారాయణ స్వామివార్కి శనివారం ప్రాకారసేవ ఘనంగా జరిగింది. ఉదయం 10 గంటలకు శ్రీ స్వామి,అమ్మవార్లను ప్రాధాన రాజగోపురం వద్దకు తోడ్కొని వచ్చి సర్వాంగ సుందరంగా తిర్చి దిద్దిన వెండి తిరుచ్చిపై ఆశినులు గావించి భక్తుల గోవింద నామస్మరణాలు,మేళ,తాళాలు సడుమ శ్రీ స్వామి,అమ్మవార్లను ముమ్మారు ప్రాధాన రాజగోపురం చుట్టూ ప్రదక్షిణ గావించారు.ఈ కార్యక్రమంలో ఏఈవో ప్రసాద్, సూనరింటెండెంట్ టెంపుల్ ఇన్ స్పెక్టర్ పోల్నాటి లక్ష్మీనారాయణ, దేవస్థానం మాజీ పాలకమండలి సభ్యులు కొత్త.కొండబాబు తదితరులు పాల్గొన్నారు.

## పెద్దాపురం కోర్టు ప్రాంగణంలో జాతీయ లోక్ అదాలత్



పెద్దాపురం : పెద్దాపురం కోర్టు ప్రాంగణంలో జాతీయ లోక్ అదాలత్ నిర్వహించబడింది. ఈ లోక్ అదాలత్‌నకు నాలుగు బెంచీలు ఏర్పాటు చేయబడినవి. మొదటి బెంచ్‌నకు ఆర్.జె.విశ్వనాథం, (VII అడిషనల్ డిస్ట్రిక్ట్ జడ్జి), ఎంఎస్ఎన్.మూర్తి (అడ్వకేట్), రెండవ బెంచ్‌నకు కె.రత్నకుమార్, సీనియర్ సివిల్ జడ్జి, ఎ.వి.జనార్ధనం (అడ్వకేట్), మూడవ బెంచ్‌నకు సిహెచ్.సునందమ్మ(Prl జూనియర్ సివిల్ జడ్జి), ఎస్.దుర్గారావు (అడ్వకేట్), నాల్గవ బెంచ్‌నకు టి.జ్యోత్సదేవి (అడిషినల్ జెఎఫ్‌సి మెజిస్ట్రేట్, ఎం.రాంబాబు (అడ్వకేట్) మెంబర్లుగా వ్యవహరించారు. ఈ లోక్ అదాలత్‌లో మొత్తం 304 కేసులు రాజీ చేయబడినవి. వివిరాల్లోకి వెళ్ళగా సివిల్ 20 రాజీ మొత్తం 12,49,500/-, క్రిమినల్ 53, ఎక్సైజ్ కేసులు 186 రాజీ మొత్తం 45,000/- మనోవర్తి కేసులు 2, రాజీ మొత్తం 5,00,000/-, మోటారు వాహనాల చట్టం కేసులు 3, వాటి రాజీ మొత్తం 8,90,000/-, బిఎస్ఎన్ఎల్ ప్రీ లిటిగేటిక్ కేసులు 40 రాజరీ మొత్తం 34,387/-.

### జవహర్ నవోదయ విద్యాలయంలో 6వతరగతి ప్రవేశ పరీక్షలకు హాల్ టికెట్లు డౌన్‌లోడ్

పెద్దాపురం : జవహర్ నవోదయ విద్యాలయం, పెద్దాపురం నందు 2010-21 విద్యాసంవత్సరంనకు 6వతరగతిలో ప్రవేశం కొరకు ఎంపిక పరీక్ష వచ్చే నెల జనవరి 11, 2020 (శనివారం)న జిల్లాలోని ఎంపిక చేయబడిన పరీక్షా కేంద్రాల్లో జరుగును. ఈ ప్రవేశ పరీక్షకు దరఖాస్తు చేసిన విద్యార్థులు తమ హాల్ టిక్కెట్స్‌ను www.nvs admission class six.in (or) www.navodaya.gov.in అనే వెబ్‌సైట్ ద్వారా డౌన్‌లోడ్ చేసుకోగలరని జవహర్ నవోదయ ప్రిన్సిపాల్ జె.సి.రమణ ఒక ప్రకటనలో తెలియజేశారు.



అనకాపల్లి మండలంలో రామభద్రాపురం గ్రామంలో బాలగౌరమ్మ ఉత్సవాలలో భాగంగా శనివారం అన్నసమారాధన నిర్వహించారు. ఈ అన్నసమారాధన కార్యక్రమాన్ని తెలుగుదేశం పార్టీ అర్బన్‌జిల్లా ఉపాధ్యక్షులు మళ్ల సురేంద్ర ముఖ్య అతిధిగా హాజరై ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో యల్లపు వెంకటరావు, దాడి జగన్, పొలిమేర ఆనంద్, భానుచందర్, కర్రి నాయుడు, మణి, ఆది తదితరులు పాల్గొన్నారు.

### ఆంధ్రప్రదేశ్ అవుట్‌సోర్సింగ్ ఏజెన్సీ కార్పొరేషన్ (ఎపిసిఒఎస్) కు

# కార్మికుల పేర్లను నమోదు చేయాలి

### బినామీల పేర్లతో నడుపుతున్న కాంట్రాక్టర్లు వారికి సహకరించిన అధికారులపై చర్యలు తీసుకోవాలని సిఐటియు డిమాండ్




విశాఖపట్నం : విశాఖ మ్యూజియం వర్కర్స్ యొక్క మీటింగ్ మ్యూజియంలో జరిగింది. ఎపి మున్సిపల్ ఫెడరేషన్ (సిఐటియు) గౌ॥అధ్యక్షులు పి.వెంకటరెడ్డి, జివిఎంసి కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ వర్కింగ్ ప్రెసిడెంట్ టి.నూకరాజు మాట్లాడుతూ ఎపి అవుట్‌సోర్సింగ్ సొసైటీలో ఈమధ్యకాలంలో వేసుకుంటున్న బినామీ పేర్లను వెంటనే నిలుపుదల చేయాలని డిమాండ్ చేశారు. అలాగే విశాఖ మ్యూజియంలో గత 5సం॥లు నుండి 15సం॥ల (2019 డిసెంబర్ వరకు) 15మంది గార్డులు, 10మంది హౌస్‌కీపింగ్ వర్కర్స్‌గా విధులు నిర్వహించారు. 01-12-2019 నుండి ఈ విశాఖ మ్యూజియంకి మరొక ఇద్దర్ని కాంట్రాక్టర్ వెంకటేశ్వరరావు తీసుకొని వచ్చి కె.అరుణను సూపర్ వైజర్‌గా, ఎస్.నాగమణిని వర్కర్‌గా విధుల్లో పెట్టి వెళ్ళటం జరిగింది. గత 15సం॥ల నుంచి లేని వర్కర్లు ఇద్దరు ఇప్పుడే వచ్చి పని చేయడం వల్ల కొన్ని అనుమానాలు వస్తున్నాయి. ఎపి అవుట్ సోర్సింగ్ సొసైటీ వచ్చిన తరువాత మాత్రమే ఈ ఇద్దర్ని తీసుకొని వచ్చి, ఇక్కడ పనిలోకి పెట్టడం అంటే ఇంతవరకు పనిచేయని వీరియొక్క జీతాన్ని ఎవరు తీసుకుంటున్నారో ఆ అధికారులు, కాంట్రాక్టర్లపై తగిన చర్యలు తీసుకోవాలి. అలాగే ఇన్నాళ్ళు ఇక్కడ పనిచేయని ఈ ఇరువురు కె.అరుణ, ఎస్.నాగమణి వ్యక్తుల్ని విధుల నుండి ఆపివేసి, అవుట్‌సోర్సింగ్ సొసైటీకి ఇవ్వకుండా నిలుపుదల చేయాలి. అలాగే అండర్‌గ్రౌండ్ డ్రైనేజ్ సెక్షన్ జోన్-2 పాండురంగాపురం పంప్‌హౌస్‌లో భాస్కరరావు, శాంతి ఆశ్ర మంలో ఒకర్ని, 7బ్లాక్‌లలో సంతోష్ ఎప్పుడు విధులు నిర్వహించని ఈ ముగ్గురు వ్యక్తులను తీసుకొని వచ్చి, వీరి పేర్లను ఎపి అవుట్‌సోర్సింగ్ ఏజెన్సీ కార్పోరేషన్ (ఎపిసిఒఎస్) లలో పేర్లను నమోదు చేయిస్తున్నారు. కనుక ఈ సొసైటీకి ఎటువంటి అవినీతికి తావు లేకుండా చర్యలు తీసుకొని, ఇంతవరకు బినామీ పేర్లపై నడుపుతూ ప్రజల సొమ్మును స్వాహా చేస్తున్న కాంట్రాక్టర్లపై మరియు దానికి సహకరించిన అధికారులపై వెంటనే చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే యుజిడి కార్మికుల 4నెలలు, 3నెలలు బకాయి జీతాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ మీటింగులో ఎం.ఈశ్వరరావు, యుజిడి ఆదినారాయణ, మ్యూజియం కార్మికులు పాల్గొన్నారు.

### దిశ చట్టం అమలు చేసినందుకు

# ముఖ్యమంత్రి జగన్ చిత్రపటానికి పాలాభిషేకం



కొయ్యూరు : మండల కేంద్రంలో విద్యార్థుల ముఖ్యమంత్రి జగన్ ఫోటో కు పాలాభిషేకం చేశారు. వివరాలిలా ఉన్నాయి. దిశ పేరుతో చట్టం చేసి దానిని అమలు పరిచి నందుకు విద్యార్థులు వాళ్ల తల్లిదండ్రులు ఎంతో ఆనందం వ్యక్తం చేశారు. దేశంలో మానవ మృగాలు మహిళలపై జరుగుతున్న దాడులు భాగంగా ముఖ్యమంత్రి దిశ పేరుతో చట్టం అమలు పరిచి నందుకు సంతో షంగా ఉందని మహిళలు, విద్యార్థులు ఆనందం వ్యక్తం చేసి, స్వీట్లు పంచుకున్నారు.. ఈ కార్య క్రమంలో వైసిపి నాయకులు బడుగు రమేష్, గాడి సత్తిబాబు, జల్లి బాబులు, అప్పన్న వెంకటరమణతో పాటు స్థానిక మహిళలు పాల్గొన్నారు.

# అనంతగిరిలో టీడీపీ పార్టీ సర్వసభ్య సమావేశం



తెలుగుదేశం పార్టీ సమావేశంలో మాట్లాడుతున్న టీడీపీపార్టీ నాయకులు జన్ని అప్పారావు

అనంతగిరి : అనంతగిరి మండల కేంద్రంలో శనివారం మండల తెలుగుదేశం పార్టీ సర్వసభ్య సమావేశము జరిగినది ఈ కార్యక్రమంలో అనంతగిరి మండల తెలుగుదేశం పార్టీ నాయకులు జన్ని అప్పారావు మాట్లాడుతూ మండలంలోని అన్ని పంచాయతీలలో పంచాయతీ కమిటీ అధ్యక్ష కార్యదర్శులు ఎన్నుకోవడం జరిగిందని మండల కమిటీ అధ్యక్ష కార్యదర్శులు ఎన్నిక జరగవలసి ఉందని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో అనంతగిరి మాజీ జెడ్పిటిసి అప్పారావు అధ్యక్షులు అంటి పర్తి బుచ్చిబాబు కార్యదర్శి ఆనందరావు జోగులు తది తరులు పాల్గొన్నారు.

# 18వవార్డులో శ్రీశ్రీశ్రీ కనకమ్మ వారి ఆలయం ఆధునీకరణకు సంబంధించిన అంశాలపై సమీక్ష



విశాఖపట్నం : విశాఖ తూర్పు నియోజకవర్గ పరిధిలో గల 18 వార్డ్ లో గల చినవాల్తేర్ శ్రీ శ్రీ శ్రీ కనకమ్మ వారి ఆలయం ఆధునీకరణ కు సంబం ధించిన అంశాలపై వైసీపీ నగర అధ్యక్షులు వంశీ కృష్ణ శ్రీనివాస్ సైదాతో శివాజిపాలెం నివాసంలో చర్చించారు. త్వరలో సంబంధిత దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రివర్యులు వెల్లంపల్లి శ్రీనివాస్‌తో ఆలయ సందర్శన ఉంటుం దన్నారు. ఎంతో ప్రాముఖ్యత కలిగిన అమ్మవారి ఆలయంలో మరిన్ని వసతులు ఏర్పాటు చేసి, ఆధునీకరణ చేపడతామని అన్నారు. ప్రభుత్వ నిధులులతో త్వరలో ఈ అభివృద్ధి కార్యక్రమం చేపడతామని అన్నారు. కార్యక్రమంలో స్థానిక వార్డ్ అధ్య క్షుడు మదుపాడ రవికుమార్, కొయ్య కాశీ మరియు జిల్లా ఎస్‌సి విభాగ అధ్యక్షుడు బోణి శివరామకృష్ణ పాల్గొన్నారు.

# ముఖ్యమంత్రి జగన్ చిత్రపటానికి పాలాభిషేకం చేసిన వైసీపీ నాయకురాలు బత్తికోల పద్మ



సబ్బవరం : ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి చిత్ర పటానికి సబ్బవరం మండల కేంద్రంలో మేజర్ పంచాయితీలో భాగమైన గణేష్ దుర్గా నగర్ మహిళలు వైసిపి నాయకురాలు ఆధ్వర్యంలో మహిళలు శనివారం పాలాభి షేకం చేశారు. మహిళల రక్షణ కొరకు చట్టం తీసుకు రావడం పట్ల ఇక్కడ మహిళలు హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తూ ఆనందంతో జగన్ చిత్రపటానికి పాలాభిషేకం చేసారు. ఈ సందర్భంగా మండల వైసిపి నాయకురాలు బత్తికోల పద్మ మాట్లాడుతూ మహిళలపై జరుగుచున్న అత్యాచారాలు, దురాగతాలపై మన ముఖ్యమంత్రి చట్టం తీసుకొని రావడం పట్ల ఆమె ఆనందాన్ని హర్షాన్ని వ్యక్తం చేసారు. ఇటీవల కాలంలో ఆడపిల్లల పట్ల నేరాలు పెరిగి పోయాయని ఆమె ఆరోపించారు. ఒంటరిగా మహిళలు ఎక్కడికైనా వెళ్లాలంటే భయము వేస్తుందన్నారు. ఒంటరిగా ఉన్న భయం వేస్తుందన్నారు. ఒంటరిగా ఉన్న మహిళలపై సామూహిక మానభంగాలు చేయడం మంచి పద్ధతి కాదన్నారు. సమాజంలో మహిళలు ఒంటరిగా తిరిగినప్పుడే మహిళలకు స్వేచ్ఛ వస్తుందన్నారు. మృగాళ్లకు 21 రోజులలో విచారణ జరిపి విచారణలో ఋజువైతే ఉరి శిక్ష వేయడం మంచిదేనన్నారు. మానవులు రాక్షసులులాగా, మానవ మృగాలుగా ప్రవర్తించ రాదని ఆమె హితవు పలికారు. ఎవరైనా మహిళలపై దాడి చేస్తే కఠినంగా శిక్షించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్య క్రమంలో మహిళలంతా ఎకధాటిపై వచ్చి పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో విజయ, రాధ, నాగు, వరలక్ష్మి, కుమారి, నాగరత్నం, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# సత్యదేవుడ్ని దర్శించిన జాతీయ ఎస్సీ కమిషన్ సభ్యులు శ్రీరాములు



అన్నవరం : తూ.గో.జిల్లా ప్రముఖ పుణ్యక్షేత్రము అన్నవరం శ్రీ వీరవేంకట సత్యనారాయణ స్వామివారి జాతీయ ఎస్సీ కమీషన్ శ్రీరాములు కుటుంబ సమేతముగా శ్రీ స్వామివార్ని దర్శించి, ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఆయనకు ఆలయ మర్యాదలతో ఆలయ ఈవో వి.త్రినాధ రావు, చైర్మెన్ ఐ.వి.రోహిత్, ఏఈవో ప్రసాద్,పిఆర్వో కొండలరావు ఘన స్వాగతం పలికారు.దర్శనం అనంతరం వేద పండితులు వేద ఆశీర్వాదములు అందజేశారు. అనంతరం ఈవో త్రినాధరావు శ్రీ స్వామి వారి ప్రసాదమును,శేష వస్త్ర మును అందజేశారు. ఈ కార్య క్రమంలో ఆయన వెంట డీసీసీబీ డైరెక్టర్ శెట్టిబత్తుల కుమార్ రాజా తదితరులు పాల్గొన్నారు. అనంతరం జాతీయ ఎస్సీ కమీషనర్ శ్రీరాములు ను స్దానిక దళిత నాయకులు కలిసి స్వాగతం పలికి అన్నవరం డిగ్రీ కాలేజ్ మరియు జూనియర్ కాలేజ్ మరియు దేవస్థానంలో చాలా సంవత్సరాలుగా ఉన్న ఎస్సీ బ్యాక్ లాగ్ పోస్టులు భర్తీకి నోచుకోవట్లేదని,తక్షణమే దానిపై చర్యలు చేపట్టాలని వినతి పత్రం అందించారు.

.ఈ కార్యక్రమంలో జిల్లా సహకార బ్యాంకు డైరెక్టర్ శెట్టిబత్తుల. కుమార్ రాజాతో పాటు స్దానిక నాయకులు రాజాల. చిట్టిబాబు, సరమర్ల. మధుబాబు, రాయి.శ్రీనివాస్. పలివెల సతీష్ తదితరులు పాల్గొన్నారు.

# ఓక్రిడ్జ్ ఇంటర్నేషనల్ స్కూల్‌లో ఘనంగా ఓపెన్ డే కార్యక్రమం




భీమునిపట్నం: తగరపువలస ఓక్రిడ్జ్ ఇంటర్నేషనల్ స్కూల్ లో ఘనంగా ఓపెన్ డే కార్యక్రమం శనివారం జరిగాయి. ఇందులో ట్రాన్స్ఫర్మేషన్ లెర్నింగ్ ఎక్స్పీరియన్స్ తెలియజేయడానికి ఓపెన్ డే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా స్కూల్లో చదువుతున్న విద్యార్థులు వారి యొక్క ప్రదర్శనలను, వర్క్ షాప్‌లను నిర్వహించారు. ఓక్రిడ్జ్ విద్యార్థులు మసాచుసెట్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ మరియు యూ ఎన్‌ఐసి ఈ ఎఫ్ భాగస్వామితో మిట్రస్టీమ్ ఛాలెంజ్‌లో పాల్గొన్నారు. విద్యార్థులు తమ పాఠశాలకు వచ్చిన సందర్శకులకు అతిథులకు బాలల హక్కుల యు ఎన్ సి ఆర్ సి గురించి ఎం ఏ ఈ గ్లోబల్ క్యాంపస్ ఛాలెంజర్స్ గురించి వివరించారు. వివిధ సబ్జెక్టులకు సంబంధించిన అంశాలను చార్ట్ ద్వారా అయాయ అంశాలను ఏ విధంగా నేర్చు కోవచ్చు తెలియజేశారు. చదువులో ఒత్తిడి మరియు భయాందోళనలు లేకుండా ఏ విధంగా నేర్చుకోవచ్చు తెలియజేశారు. పాఠశాలలోని తరగతికి వెళ్లి అక్కడ వారు అవలంబిస్తున్న శాస్త్రీయ విధానాలను చూపించారు. విద్యార్థు లకు నేర్పిస్తున్న పాటలు నిత్యం డ్రామా మరియు సంగీతం వంటి అంశాలను ప్రదర్శించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ శ్రీ బేబి మాట్లాడుతూ చదువు అనేది విద్యార్థుల ప్రపంచం నుండి ఎంత ఎంత నేర్చుకున్నారు అనేది కాకుండా వారు జీవించడానికి నేర్చుకున్న విద్యను ప్రపంచానికి అందిస్తున్నారు అనేది ముఖ్య మని అన్నారు. విద్యార్థుల్లో ఉన్న అభిరుచులను వ్యక్తపరి చేందుకు ఓపెన్ డే కార్యక్రమం చక్కని ఉదాహరణ అని పేర్కొన్నారు.ఈ కార్యక్రమం లో విద్యార్థుల తలిదండ్రులు అదిక సంఖ్య లో పాల్గొన్నారు.

# అమ్మఒడి పథకానికి రేషన్ కార్డు మినహాయింపు ఇవ్వాలి

### కొణతాల సీతారాం డిమాండ్




అనకాపల్లి : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మ కంగా ప్రవేశపెట్టిన అమ్మ ఒడి పథకానికి రేషన్ కార్డు మినహాయింపు ఇవ్వాలని జై అనకా పల్లి సేన వ్యవస్థాపకులు కొణతాల సీతారాం డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. వివిధ కారణాల వల్ల ఎన్నికలకు ముందు ఎన్నో రేషన్ కార్డులు ఇనేక్టివ్ అయ్యా యన్నారు. కార్డులు కోల్పోయిన వారు వాటిని పునరుద్ధరించు కోవడానికి చాలా అవాంతరాలు ఎదురయ్యాయన్నారు. అలాగే గడిచిన సార్వత్రిక ఎన్నికల నోటిఫికేషన్ విడుదలైంది మొదలు నేటి వరకు కొత్త రేషన్ కార్డులకు దరఖాస్తు చేసుకునే అవకాశం లేకపోయిందన్నారు. ప్రభుత్వం ఇప్పుడు కార్డుల దరఖాస్తుకు అనుమతించినా కూడా అమ్మ ఒడి మంజూరు ప్రక్రియ తుది దశకు చేరుకుందన్నారు. ఇప్పటికే అర్హత పరిశీలన సమయంలో రేషన్ కార్డు లేదనే కారణంతో కొన్ని అప్లికేషన్లు తిర స్కరణ దిశగా కదులుతున్నా యనే సమాచారం ఉంద న్నారు.

రేషన్‌కార్డు లేనంత మాత్రాన మిగిలిన అర్హ తలు అన్నీ ఉన్న విద్యార్థులకు ప్రోత్సాహం అందించరా అని ప్రశ్నించారు. తక్షణమే ప్రభుత్వం స్పందించి రేషన్ కార్డుతో సంబంధం లేకుండా అమ్మ ఒడి పథకం వర్తించేలా చర్యలు తీసుకోవాలని...

ఏ ఒక్క తల్లి ఆవేదనకు గురి కాకుండా చూడాలని సీతారాం కోరారు.

## సిఐటియు రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయండి

విశాఖపట్నం : సిఐటియు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర 15వ మహాసభలు డిసెంబరు 15 నుండి 17 వరకు శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లాలో జరుగుతాయి. డిసెంబరు 15న మ॥ 2 గంటలకు "ఆత్మకూరు బస్టాండ్ నుండి భారీ కార్మిక ప్రదర్శన 3 గంటలకు విఆర్ హైస్కూల్ గ్రౌండ్‌లో బహిరంగ సభ" జరుగుతుంది. ఈ మహాసభల్లో పాల్గొనేందుకు సిఐటియు నగరం నుండి వివిధ యూనియన్లు, జోన్లు, రంగాలకు చెందిన 50మంది ప్రతినిధులు నెల్లూరు వెళ్ళారు. ఈనెల 15,16,17 తేదీల్లో సిఐటియు రాష్ట్ర మహాసభలు నెల్లూరులో జరుగుతున్నాయన్నారు.

# టిడిపి నిర్మించిన భవనాలకు రంగులు వేయడమేనా వైసీపీ అభివృద్ధి మాజీ ఎమ్మెల్యే పీలా



అనకాపల్లి : గత చంద్రబాబు ప్రభుత్వ హయాంలో నిర్మించిన భవనాలకు రంగులు వేయడం తప్ప అధికారంలోకి వచ్చిన ఏడు నెలల్లో జగన్మోహన్‌రెడ్డి చేసిన అభివృద్ధి ఏమిటని మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ అన్నారు. శనివారం ఉదయం కళ్యాణి నర్సింగ్‌హోమ్ మేడపైన గల పార్టీ పట్టణ అధ్యక్షులు డాక్టర్ కె.కె.వి.ఏ నారాయణరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో పీలా గోవింద సత్యనారాయణ మాట్లాడుతూ చంద్రబాబు ప్రభుత్వం హయాంలో దేశంలో ఏ రాష్ట్రంలోని అమలు చేయని అభివృద్ధి సంక్షేమ పథకాలను ప్రజలకు అందించిన ఘనత చంద్రబాబుదేనని వీరు అన్నారు. వైఎస్సార్ సిపి అధికారంలోకి వచ్చాక పేదలకు అందే ఆరోగ్యశ్రీ పథకం పడకేసిందన్నారు. గత టిడిపి ప్రభుత్వ హయాంలో ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి కోట్లాది రూపాయల నిధులను అందించిన ఘనత చంద్రబాబు ప్రభుత్వానిదేనన్నారు. అన్న క్యాంటీన్లను మూసి వేసి పేద ప్రజల పొట్ట కొట్టారని వీరు అన్నారు. ఇప్పటికైనా జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే గత ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను నెరవేర్చి పేద ప్రజల బాధలను తొలగించాలని అన్నారు.

ఈ సమావేశంలో ఎమ్మెల్సీ బుద్ద నాగజగదీష్, కొణతాల వెంకట్రావు, మళ్ల సురేంద్ర, బి.ఎస్.ఎమ్.కె జోగినాయుడు, సిరసపల్లి సన్యాశిరావు, బోడి వెంకట్రావు, ధనాల విష్ణు చౌదరి, మిర్తిపాటి గోపాలరావు, దాడి జగన్, పొలిమేర నాయుడు, పొలిమేర ఆనంద్, పెద్ద సంఖ్యలో టిడిపి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# కందర్ప రాధకు స్వర కళాభినేత్రి బిరుదు ప్రదానం

## హాజరైన ద్రోణం రాజు, జి.ఎస్.ఎన్.రాజు...



అమర గాయకులు ఘంటసాల, మహా నటి సావిత్రి జయంతి సందర్భంగా ఘంటసాల స్వేర్ట్స్ అండ్ కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం సాయంత్రం కళాభారతి ఆడిటోరియంలో ప్రముఖ గాయని కందర్ప రాధను స్వర కళాభినేత్రి బిరుదుతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిధిగా హాజరైన వి.ఎం.ఆర్.డి.ఏ. చైర్మన్ ద్రోణంరాజు శ్రీనివాస్ మాట్లాడుతూ పాటల్లో ఘంటసాల, నటనలో సావిత్రి జన హృదయాలలో చిరస్మరణీయమని అన్నారు. గాయనీ కందర్ప రాధ చేసిన సేవల్ని గుర్తించి సత్కరించడం గొప్పవిషయమన్నారు. సెంచూరియన్ విశ్వవిద్యాలయం ఉపకులపతి జి.ఎస్.ఎన్ రాజు మాట్లాడుతూ ఘంటసాల గానం, సావిత్రి అభినయం మరపురానివన్నారు. అనంతరం జరిగిన సంగీత విభావరిలో కె.రాజేంద్ర ప్రసాద్, రమణి పాడిన కన్నులు నీవే కావాలి, బంగార్రాజు, కందర్ప రాధ పాడిన హిమగిరి సొగసులు, ఎం.ఎస్.మాధవ్, భాగ్యలక్ష్మి పాడిన నీకోసమే నే జీవించునది, ప్రకాశరావు, జ్యోతిక పాడిన పాడిన కన్నుల్లో మిసమిసలు, మాధవరావు, శైలజ మీరాజ్ పాడిన చందురుని మించు వంటి గీతాలు ఆలపించి ప్రేక్షకుల ప్రశంసలు అందుకున్నారు. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ వి.ఎల్.ఎన్.గిరిజ, వికసం గౌరవాధ్యక్షులు కొణతాల రాజు,

# జీవీఎంసీ ఎన్నికల దృష్ట్యా టిడిపి పార్టీ బలోపేతానికి కృషి

## దక్షిణ నియోజకవర్గ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్



విశాఖపట్నం: విశాఖ దక్షిణ నియోజకవర్గ శాసనసభ్యులు వాసుపల్లి గణేష్ కుమార్ రాబోయే ఫిబ్రవరి 2020 లో హై కోర్ట్ ఆదేశానుసారం జరగబోయే జీవీఎంసీ ఎన్నికల దృష్ట్యా టీడీపీ పార్టీ బలోపేతానికి కృషి చేయాలని బూత్ లెవెల్ లో కష్ట పడి పని చేసే వార్డ్ నాయకులని 18న 15, 24 30 వార్డ్ ప్రెసిడెంట్స్ ఎన్నిక, తే19-12-2019దీ న 20,25 44 వార్డ్ ప్రెసిడెంట్స్ ఎన్నిక మరియు 20న 23 27 వార్డ్ ప్రెసిడెంట్స్ ఎన్నికను ఎన్నికొని పార్టీ పటిష్టానికి మన వంతు గా పని చేయాలని పిలుపునిచ్చారు.

మరియు ప్రతీ వార్డ్ కు ముగ్గురు చొప్పున ఇంఛార్జిస్ ను పర్యవేక్షణ నిమిత్తం నియమించడం జరిగింది. మిగిలిన 6వార్డ్లు 21, 22, 26, 28, 29 31 లను ఎమ్మెల్యే సమక్షంలో జరుగునని తెలియజేసారు.

# దాడులపై సత్వరమే స్పందించాలి

## జాతీయ ఎస్సీఎస్టీ కమీషన్ సభ్యులు శ్రీరాములు



కాకినాడ: ఎస్సీ,ఎస్సీలపై జరుగుతున్న దాడుల విషయంలో అధికారులు, పోలీసులు సత్వరమే స్పందించి బాధితులకు న్యాయం చేయాలని జాతీయ ఎస్సీ,ఎస్టీ కమీషన్ సభ్యులు కె.శ్రీరాములు అన్నారు.జిల్లా పర్యాటనలో భాగంగా శనివారం కాకినాడ విచ్చేసిన సందర్భంగా కాకినాడ రహదారులు మరియు భవనాల శాఖ అతిధి గృహంలో కమీషన్ సభ్యులను జిల్లా కలక్టర్ డి.మురళీధర్ రెడ్డి,ఎస్పీ అద్నామ్ నయీం అస్మి మర్యాద పూర్వకంగా కలిసారు.

ఈసందర్భంగా జిల్లాలోని ఎస్సీ,ఎస్టీలపై ఉన్న పెండింగ్ కేసులను సత్వరమే చర్యలు తీసుకుని బాధితుల వర్గాల వారికి న్యాయం జరిగేలా కృషి చేయాలని కమీషన్ సభ్యులు రాములు అధికారులకు సూచించారు.

అనంతరం ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ దేశంలోనే ఎస్సీ,ఎస్టీలపై హత్యాచారాలు విపరీతంగా జరుగుతన్నాయని ప్రధానంగా ఏపీ,కర్నాటక,తెలంగాణా రాష్ట్రాలలో దళితులపై దాడులు విపరీతంగా జరుగుతన్నాయన్నారు.స్వాతంత్ర్యం వచ్చి 70సం॥ గడచినా బడుగు ,బలహీన దళితులపై ఇంకా దాడులు జరగడం దురదృష్టకరమని అన్నారు. మహిళ హత్యాచారాలు,హత్యల విషయాలలో అగ్రవర్ణాల వారికి ఒక న్యాయం,దళితులకు ఒక న్యాయం కాకుండా అన్ని వర్గాలకు సమన్యాయం పాటించాలని సూచించారు.ఎస్సీ,ఎస్టీ అట్రాసిటీ కేసుల విషయంలో పోలీసు అధికారులు వెంటనే స్పందించి చర్యలు వేగవంతం చేసి బాధితులకు న్యాయం చేకూర్చాలన్నారు.ఎస్సీ, ఎస్టీ ఉపప్రణాళిక నిధులు ఇతర శాఖలకు బదలాయించకుండా కేవలం దళితుల అభివృద్ధికి ఖర్చు చేయ్యాలని శ్రీరాములు సూచించారు. సంక్షేమ వసతిగృహాల విద్యార్థినీవిదార్థులకు వసతులు సరిగా ఉండటంలేదని కమీషన్ దృష్టికి పిర్యాదులు అందుతున్నాయని పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు.అలాగే దళితులకు రేషన్ కార్డుల మంజూరులో జాప్యాన్ని నివారించాలని సూచించారు.ఎస్సీ కార్పోరేషన్ ద్వారా ఎస్సీ,ఎస్టీ లబ్ధిదారులకు అందించే రుణాలు త్వరితగతిన అందించాలని సూచించారు.అనంతరం జిల్లా నలుమూలల నుండి వచ్చిన దళితుల నుండి వినతి పత్రాలు స్వీకరిచారు.ఈ కార్యక్రమంలో సాంఘిక సంక్షేమ శాఖ ఉపసంచాలకులు ఎం.శోభారాణి, కాకినాడ ఆర్డీఓ చిన్నకృష్ణ,డిఎస్పీ కరణం కుమార్,బి.రామకృష్ణ, డిఎస్‌డబ్లూఓ జెవి.రమణ , ప్రభుత్వ మాల ఉద్యోగలు సంఘం నాయకులు నక్కా రాజశేఖర్,ఆకుమర్తి చిన్నా,తదితరులు పాల్గొన్నారు.

# స్వగృహానికి గొల్లపూడి భౌతికకాయం

## నివాళులర్పించిన చిరంజీవి, సుహాసిని



చెన్నై: ప్రముఖ నటుడు, రచయిత గొల్లపూడి మారుతీరావు భౌతికకాయాన్ని స్థానిక ప్రైవేట్ ఆస్పత్రి నుంచి ఆయన స్వగృహానికి తరలించారు. ప్రముఖుల, అభిమానులు సందర్శనార్థం గొల్లపూడి పార్థీవదేహాన్ని టీ-నగర్‌లోని ఆయన నివాసంలో ఉంచనున్నారు. గొల్లపూడి అంత్యక్రియలు ఆదివారం మధ్యాహ్నం రెండు గంటలకు కన్నమ్మపేట దహనవాటికలో నిర్వహించనున్నట్లు ఆయన కుటుంబసభ్యులు పేర్కొన్నారు. అదేరోజు ఉదయం టీనగర్ నుంచి అంతిమయాత్ర ప్రారంభం అవుతుందని వారు చెప్పారు.

**చిరంజీవి, సుహాసిని నివాళి**

గొల్లపూడి మారుతీరావు భౌతికకాయానికి హీరో చిరంజీవి నివాళులర్పించారు. చెన్నై టీ-నగర్‌లోని శారదాంబల్‌లోని ఆయన నివాసానికి వెళ్లిన చిరంజీవి.. గొల్లపూడి పార్థీవదేహానికి పూలమాల వేసి శ్రద్ధాంజలి ఘటించారు. చిరంజీవితో పాటు సినీనటి సుహాసిని సహా పలువురు ప్రముఖులు గొల్లపూడికి నివాళులర్పించారు.

గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న గొల్లపూడి మారుతీరావు చెన్నైలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ గురువారం మధ్యాహ్నం తుదిశ్వాస విడిచిన విషయం తెలిసిందే.

మారుతీరావు 1939 ఏప్రిల్ 14న విజయనగరంలో జన్మించారు. కోడి రామకృష్ణ దర్శకత్వం వహించిన ఇంట్లో రామయ్య- వీధిలో క్రిష్ణయ్య సినిమాతో ఆయన నటుడిగా పరిచయం అయ్యారు. దాదాపు 250 సినిమాల్లో నటించారు. సినిమాల్లోకి రాకముందు నాటకాలు, నవలలు, కథలు రాసేవారు. డాక్టర్ చక్రవర్తి సినిమాతో రచయితగా సినిమాలోకానికి పరిచయం అయ్యారు. వినూత్న విలనిజానికి ఆయన పెట్టింది పేరు. రచయితగా, ప్రతినాయకుడిగా, సహాయనటుడిగా, హాస్యనటుడిగా ఇలా అన్ని కోణాల్లో తనకంటూ ఓ ప్రత్యేక స్థానం సంపాదించుకున్నారు.

# విద్యుత్ ఆదా ఆవశ్యకత ఎంతైనా ఉంది

## కలెక్టర్ మురళీధర్ రెడ్డి



కాకినాడ: ప్రస్తుత రోజుల్లో విద్యుత్ వినియోగం బాగా పెరగడం వలన సమజ వనరులు తగ్గడంతో విద్యుత్‌ను పొదుపు చేయవలసిన ఆవస్యకత ఎంతైనా ఉందని జిల్లా కలెక్టర్ డి.మురళీధర్ రెడ్డి తెలిపారు. కలక్టర్ కార్యాలయంలో పరివేక్షక ఇంజనీరు ఏపీఇపిడిసిఎస్ రాజమహేంద్రవరం సిహెచ్.సత్యనారాయణ రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జాతీయ విద్యుత్ పొదుపు వారోత్సవాలర్యాలీని జిల్లాకలక్టర్ మురళీధర్‌రెడ్డి జెండా ఊపి ప్రారంభించారు.ఈసందర్భంగా ఈ వారోత్సవాలు ఈనెల14 నుండి20 వరకు జిల్లా వ్యాప్తంగా వారం రోజుల పాటు నిర్వహించనున్నారన్నారు. ప్రస్తుత రోజుల్లో ప్రజలు విపరీతంగా ఏసీ,రిఫ్రిజిరేటర్లు, విద్యుత్ లైట్లు వాడటం వలన భవిష్యత్ తరాలకు కొరత ఏర్పడే ప్రమాదం ఉందన్నారు. ప్రభుత్వ కార్యాలయాల్లో అధికంగా విద్యుత్ వాడకం జరుగుతుంటుందని ఈ వృధాని అరికట్టడం చాలా ముఖ్యమైన విషయమన్నారు.విద్యుత్ పొదుపుగా వినియోగించడం వలన సహజ వనరులు ఎక్కువ కాలం ఉపయోగించుకోవడమే కాకుండా భవిష్యత్ తరాలకు కూడా ఉపయోగపడతాయని తెలిపారు.విద్యుత్ పొదుపులో భాగంగా జిల్లాలో అనేక పథకాలు అమలు చేస్తున్నట్లు తెలిపారు.25.76 లక్షల ఎల్‌ఈడి బల్బుల పంపిణీ,2,973ఎనర్జీ ఎఫిషియెంట్ మోటార్స్‌ను రైతులకు ఉచితంగా ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. అదే విధంగా విద్యుత్ వాడకం తగ్గించే చర్యలో భాగంగా ముఖ్యంగా రైతులకు 3,940 సోలార్ కనక్షన్‌లు ఇవ్వనున్నట్లు కలక్టర్ తెలిపారు.సూపరింటెండెంట్ ఇంజనీర్ సిహెచ్.సత్యనారాయణ రెడ్డి మాట్లాడుతూ అందరూ విద్యుత్ పొదుపు మహోత్సవంలో పాల్గొని విద్యుత్‌ను ఆదా చేసుకొంటూ అభివృద్ధికి సహకరించాలనికోరారు.ఈ వారం రోజులలు ప్రతి సబ్ డివిజన్ హెడ్ క్వార్టర్స్ నందు విద్యుత్ పొదుపు-ప్రాముఖ్యత, విద్యుత్ పొదుపు యొక్క ఆవశ్యకత మరియు అధునాతన పద్ధతులపై పాఠవాల విద్యార్థులకు పెయింటింగ&, వ్యాస రచన ,వకృత్వ పోటీలు, విద్యుత్ పొదుపుపై గ్రామీణ ప్రాంతాల ప్రజలకు అవగాహన కల్పించుట కొరకు జానపద కళాకారుల ప్రదర్శనలు నిర్వహిస్తున్నాట్లు తెలిపారు.ఈ నెల 20న వారోత్సవాల ముగింపు కార్యక్రమంలో పాఠశాల విద్యారుఃదలకు బహుమతులు అందజేయడం జరుగుందని తెలిపారు. ఈకర్యాక్రమంలో కాకినాడ , రాజమహేంద్రవరం, రామచంద్రాపురం, అమలాపురం,జగ్గంపేట ఎగ్గిక్యూటివ్ ఇంజనీర్లు ఎం.ఉదయ్ భాస్కర్,కె.తిలక్ కుమార్,బికె.నాయుడు,పి.సాల్మన్ రాజు, వై.డేవిడ్ , సాలిపేట పాఠశాల ఎన్‌సిసి విద్యార్థులు, పీఆర్ బాలుర పాఠశాల స్కౌట్ విద్యారుఃదలు తదితరులు పాల్గొన్నారు.

### ఆదిత్య స్కూల్ ఆఫ్ కంప్యూటర్ సైన్స్ బి.సి.ఎ విద్యార్థులచే సూపర్‌మైండ్ 5.0 ఈవెంట్

కాకినాడ : ఆదిత్య స్కూల్ ఆఫ్ కంప్యూటర్ సైన్స్ బి.సి.ఎ. విద్యార్థులచే సూపర్‌మైండ్ 5.0 ఈవెంట్ ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిధులగా ఆదిత్య డిగ్రీ మరియు పీజీ కళాశాలల అకాడమిక్ డైరెక్టర్ డా॥ బి.ఇ.వి.యల్ నాయుడు, ఆదిత్య స్కూల్ ఆఫ్ కంప్యూటర్ సైన్స్ ప్రిన్సిపాల్ శ్రీమతి డి. బ్యూలా మరియు వైస్‌ప్రిన్సిపాల్ శ్రీమతి జీ. సత్య పాల్గొన్నారు. అకాడమిక్ డైరెక్టర్ డా॥ బి.ఇ.వి.యల్ నాయుడు మాట్లాడుతూ ఈవెంట్‌లో ఫజిల్స్‌ను ఇచ్చి విద్యార్థులలోయున్న నైపుణ్యాన్ని వెలికితీయడం, వార్తా పత్రికలద్వారా చిత్రాలను కలిపి వ్యాపారులకు ఉపయోగపడే ఆలోచనలను చెప్పడం, స్టోరి టెల్లింగ్ విత్ రెండమ్ వొర్డ్స్ ద్వారా విద్యార్థిని విద్యార్థులలో నైపుణ్యాన్ని వెలికితీయటం ఒక ప్రాబలమ్ ఎన్ని విధాలుగా అరికట్టగలం, ఒక చిత్రానిచ్చి దానికి సంభందించిన అడ్వార్ట్‌జింగ్ రూపంలో చూపించి విద్యార్థులకు సవివరంగా అర్థమైయేలా వివరించారని తెలియజేశారు. అనంతరం ప్రిన్సిపాల్ శ్రీమతి డి. బ్యూలా మాట్లడుతూ ప్రస్తుత పోటీ ప్రపంచంలో అనేక టెక్నాలాజీలను ఒకే తాటిపైకి తీసుకొచ్చె ప్రయత్నం ఈరోజులలో జరుగుతుందని ఈరోజు ఈవెంట్‌లో 1) ఫన్ విత్ టెక్ ఫజిల్ 2) ఫన్ విత్ న్యూస్ పేపర్ 3) స్టోరి టెల్లింగ్ విత్ రెండమ్ వొర్డ్స్ 4) సాల్వింగ్ ప్రాబ్లమ్ ఇన్ టెక్నికల్ వే బై ప్రొవైడింగ్ టెక్నికల్ సొల్యూషన్స్ 5) అడ్వార్ట్‌జింగ్ యాప్ ఉపయోగించి విద్యార్థులకు అర్థమయ్యే విధంగా సింపుల్ మెథడ్స్‌లో వివరిస్తూ అవసరమైన డాక్యూమెంట్స్ విద్యార్థులకు ఇవ్వడం జరిగింది. ఈ ఈవెంట్‌లో దాదాపు 230 మంది బి.సి.ఎ. విద్యార్థిని, విద్యార్థులు పాల్గొనడం జరిగిందని, ఇలాంటి ఈవెంట్‌లు నిర్వహించడం వలన విద్యార్థిని విద్యార్థులకు ముఖ్యంగా కంప్యూటర్ విద్యార్థులకు ఎంతో ఉపయోగకరమని ఆదిత్య స్కూల్ ఆఫ్ కంప్యూటర్ సైన్స్ ప్రిన్సిపాల్ శ్రీమతి డి. బ్యూలా తెలియజేశారు.

# స్టాక్ పాయింట్‌ను ప్రారంభించిన పియుసి చైర్మన్ చిర్ల



రావులపాలెం: సామాన్యులకు సైతం ఇసుక అందించడమే ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన రెడ్డి లక్ష్యమని రాష్ట్ర పియుసి చైర్మన్,ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి తెలిపారు. శనివారం మండల పరిధి గోపాలపురంలో ఇసుక స్టాక్ పాయింట్ ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా చిర్ల జగ్గిరెడ్డి హాజరయ్యారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎటువంటి అవకతవకలు లేకుండా సామాన్య ప్రజలకు ఇసుక అందించాలనేది జగన్ లక్ష్యమని ఇసుక కొరతను అధిగమించేందుకు నియోజకవర్గ వ్యాప్తంగా అనేక చోట్ల స్టాక్ పాయింట్లు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఈసందర్భంగా ఇసుక స్టాక్ పాయింట్ ను ప్రారంభించి వేబ్రిడ్జి,కంప్యూటర్ గదిని పరిశీలి ంచారు. ఈకార్యక్రమంలో రుద్రరాజు రమేష్ రాజు,మాజీ వైస్ ఎంపిపి దండు వెంకట సుబ్రహ్మణ్య వర్మ, మాజీ ఎంపిటిసి ఓదూరి దానయ్య,నాగమహేశ్వర రెడ్డి, పితాని రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

# మాధవధారలో అయ్యప్ప స్వామికి మహా శాంతి పూజలు

## స్థానిక మాధవధారలో గురు స్వామి



విశాఖపట్నం: బమ్మిడి. సంతోష్ కుమార్ స్వామి పీఠం లో అయ్యప్ప స్వామి వారికీ శాంతి పూజ ని నిర్వహించడం జరిగింది, శబరిమలై దేవాలయం లో ఉండే విధంగా అయ్యప్ప స్వామి కి కండువా మాలలతో అలంకరించి అత్యంత ప్రీతివంతంగా ఉదయం 3గంటల నుంచి పూజ విధానం చెయ్యడం జరిగింది, ముందుగా వేద పండితులు శ్రీ రాపాక రామకృష్ణ శర్మ గారితో పూజ ని మొదలు పెట్టి సంతోష్ స్వామి పీఠం స్వాములందరు పూజ ని ఘనంగా నిర్వహించారు. అలాగే సాయంత్రం అయ్యప్ప స్వామికి ప్రీతివంతమైనా పడిపూజ ని కూడా అత్యంత ఘనంగా చేసి చుట్టూ పక్కల మాలధారణ చేసిన స్వామిలకు, వాళ్ల కుటుంబ సభ్యులకు 350మందికి కైంకర్యం (టిఫిన్ )ని కూడా పెట్టడం జరిగింది. ఈ సందర్భంగా గురు స్వామి సంతోష్ కుమార్ స్వామి నాకు అయ్యప్ప స్వామి కలిగించిన అదృష్టం గా నేను ఈ అలంకరణ, అన్నదానం, పూజలు ను భావిస్తున్నాను అని వాపోవడం జరిగింది.

# రూలర్ చిత్ర ప్రీరిలీజ్ వేడుక



హైదరాబాద్: ఈ పొలిటికల్ పవర్ నువ్వు తీసుకున్న డిగ్రీ అనుకున్నావా.. నువ్వు చచ్చే వరకూ నీతో ఉంటుందనుకోవడానికి.. ఎలక్షన్.. ఎలక్షన్ కి పవర్ కట్ అయిపోద్ది రా.. అంటూ ప్రతినాయకుడిని గడగడలాడిస్తున్నారు నందమూరి బాలకృష్ణ. ఆయన కథానాయకుడిగా నటించిన చిత్రం 'రూలర్'. వేదిక, సోనాల్ చౌహాన్ కథానాయికలు. ఈ చిత్ర ప్రీరిలీజ్ వేడుక విశాఖలో జరిగింది. ఈ సందర్భంగా ప్రముఖ దర్శకుడు బోయపాటి శ్రీనివాస్ ఈ చిత్ర రెండో ట్రైలర్‌ను విడుదల చేశారు . మాస్, పవర్ ఫుల్ డైలాగ్ లతో కొత్త ట్రైలర్ ఆకట్టుకుంటోంది.

అనంతరం బోయపాటి మాట్లాడుతూ.. సినిమా వారికి ఉత్తరాంధ్ర వాళ్లు ఇచ్చే గౌరవం.. చూపే అభిమానం ఏరోజుకీ మర్చిపోలేనిది. ఎక్కడా చూడలేనిది. అందుకే ఎన్నో అవకాశాలు ఉన్నా, ఇక్కడే ఫంక్షన్స్ జరుపుతాం. షుటింగ్లు కూడా చేస్తాం. ఇక్కడి ప్రాంత వాసుల్లో పాజిటివ్ నెస్ ఉంటుంది. గతంలో 'జైసింహా'తో వచ్చిన కె.ఎస్.రవికుమార్ మరోసారి అద్భుతమైన చిత్రంతో రాబోతున్నారు . ఇది తప్పకుండా విజయం సాధించాలని కోరుకుంటున్నా. 'రూలర్' టైటిల్ బాలయ్యబాబుకి సరిగ్గా సరిపోతుంది. బాలయ్య రూలర్ ఆఫ్ ది ఆర్ట్స్.. రూలర్ ఆఫ్ ది హార్ట్స్... ఎందుకంటే ఆయనకు ఒక పాత్ర వస్తే దానికి లొంగిపోతారు .

కానీ, ఒకసారి ఆ పాత్రలోకి ప్రవేశించిన తర్వాత ఆ పాత్రను వంచుతారు . అలాగే అభిమానులకు కష్టం వస్తే ఆయన ముందుంటారు . అంతా అభిమానులపై ప్రేమ చూపుతారు . ఆయన అభిమానులు మాదిరిగానే నేను కూడా 'రూలర్' సినిమా కోసం వేచి చూస్తున్నా అని అన్నారు . ఇక తన దర్శకత్వంలో బాలకృష్ణ నటించే చిత్రం జనవరి నుంచి సెట్స్ పైకి వెళ్లనుందని, కథానాయికల విషయంలో వస్తున్న ఊహాగానాలను నమ్మవద్దని తానే స్వయం ప్రకటిస్తానని బోయపాటి స్పష్టం చేశారు నటుడు రాజశేఖర్ మాట్లాడుతూ .. నేను కేవలం బాలకృష్ణ కోసమే ఈ కార్యక్రమానికి వచ్చా. నేను చిత్ర పరిశ్రమకు వచ్చినప్పటి నుంచి నన్ను వెన్ను తట్టి ప్రోత్సహించే వారిలో ఆయన కూడా ఉంటారు . బాలకృష్ణ తండ్రి ఒక రూలర్.. ఆయన నుంచి ఎన్నో నేర్చుకున్న బాలకృష్ణ కూడా అలాగే అయ్యారు . సాధారణంగా సంక్రాంతికి తన కొత్త సినిమాతో వచ్చే బాలకృష్ణ ఆ సీజన్ మొత్తం రూల్ చేస్తారు .

అలాంటిది ఈ సారి సంక్రాంతి కన్నా ముందే వచ్చి అప్పటివరకూ రికార్డులను రూల్ చేయడానికి సిద్ధమవు తున్నారు . ఒక 'రూలర్ ... మరో 'రూలర్ సినిమాతో రావడం నిజంగా అద్భుతం అన్నారు .

# దేశంలోనే అభివృద్ధి నగరంగా విశాఖను తీర్చిదిద్దడం సీఎం లక్ష్యం

- విశాఖ అభివృద్ధికి ప్రజల సహకారం అవసరం
- నివాస సంక్షేమ సంఘాల సహకారం ప్రభుత్వానికి ఎంతో అవసరం
- ఏపీ పెర్వాస్, ఆర్ డబ్ల్యూ ఏ అవార్డుల కార్యక్రమంలో పాల్గొనడం చాలా ఆనందంగా ఉంది
- రాష్ట్ర మున్సిపల్ మంత్రి బొత్స సత్యనారాయణ



విశాఖపట్నం : ప్రజల సహకారంతోనే విశాఖ నగర అభివద్ధి సాధ్యపడుతుందని, అప్పుడే అద్భుతాలు సృష్టించవచ్చునని రాష్ట్ర మున్సిపల్ శాఖ మంత్రి బొత్స సత్యనారాయణ అన్నారు. శనివారం ఏయూ ఇంజనీరింగ్ కళాశాలలోని వైవి ఎస్ మూర్తి ఆడిటోరియంలో ఆంధ్రప్రదేశ్ ఫెడరేషన్ ఆఫ్ రెసిడెంట్ వెల్ఫేర్ అసోసియేషన్ నిర్వహించిన అనంద సిటిజన్ బెస్ ఆర్.డబ్ల్యు ఎ 2019 అవార్డు ప్రధానోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరైయ్యారు. అనంతరం మంత్రి బొత్స మాట్లాడుతూ నివాసిత సంక్షేమ సంఘాలు నిర్వహించే ఇటువంటి కార్యక్రమాల్లో పాల్గొనడం చాలా ఆనందంగా ఉందన్నారు. పర్యావరణ సమతుల్యతకు, పరిసరాల పరిశుభ్రతకు ప్రజల్లో అవగాహన, చైతన్యం కల్పించడానికి నివాసిత సంక్షేమ సంఘాలు చేస్తున్న కృషి ద్వారా ఏపీ పెర్వాస్ విశాఖ నగరానికి ఒక మంచి అచారాన్ని కల్పిస్తుందని మంత్రి ప్రశంసించారు. ప్రజల ప్రాథమిక హక్కు అయిన పరిశుభ్రత, మంచి పర్యావరణాన్ని ప్రజలకు ప్రభుత్వం ఎప్పూడు అందించడానికి సిద్ధంగా ఉంటుందన్నారు. రూ.120 కోట్ల తో విశాఖ బీచ్ సుందరీకరణ, బీచ్ కోత నివారణ చర్యలు చేపడుతుందని మంత్రి అన్నారు. .డబ్ల్యు ఎస్, జీవీ ఎంసీ సంయుక్తంగా ప్రజల్లో అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని అప్పడే ప్రజలకు ఆరోగ్య కరమైన పర్యావరణాన్ని అందించవచ్చునన్నారు. ఏపీ పెర్వాస్ ప్రతినిధులు విన్నవించిన అంశాలైన ఏపీ పెర్వాస్సంస్థకు కార్యాలయ స్థలం కేటాయింపు, ఏపీ రేరా చట్టంలోని సలహదారు సభ్యులుగా నియమించాలని, సంస్థకు గుర్తింపు ఇవ్వాలని కోరారు. దీని పై మంత్రి స్పందిస్తూ జీవీ ఎంసీ కమిషనర్ తో చర్చిస్తామని, రేరా చట్టం అంశంపై ప్రభుత్వంతో చర్చించి నిర్ణయం తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమానికి ఇతర మున్సిపాల్టీలు, కార్పొరేషన్లు ఓంగోలు, విజయవాడ,కాకినాడ, నెల్లూరు ప్రాంతాల నుంచి వచ్చిన నివాస సంక్షేమ సంఘ సభ్యులను మంత్రి అభినందించారు. విశాఖ నగరాభివృద్ధికి కమిషనర్ సృజన కృషి చేస్తున్నారన్నారు. అనంతరం ఏపీ పెరావాస్ వారు ఆనంద సిటిజన్ సంస్థ సామాజిక బాధ్యతతో 140 రెసిడింట్ వెల్ఫేర్ అసోసియేషన్ల మధ్య నిర్వహించిన పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన 19 నివాస సంఘాలకు ఆనంద సిటిజన్ బెస్ట్ ఆర్ డబ్ల్యూ ఏ అవార్డులను, నగదు పురస్కారాలను ప్రధానం చేశారు. సామాజిక సతో స్వచ్ఛ భారత్ కార్యక్రమాల్లో భాగంగా తడిపొడి చెత్త విభజన, పరిసరాల పరిశుభ్రత, ఇంటి వద్దే సేంద్రీయ ఎరువును తయారు చేయడం, ప్లాస్టిక్ వినియోగానికి బదులుగా ప్రత్యామ్నాయ వస్తువలను ఉచితంగా అందించడం వాటిపై ప్రజల్లో అవగాహన కార్యక్రమాలను చేపడుతున్న పి. ఉషా గజపతిరాజు, ఇందిరా బంగారు రాజు, సుధాలకు ప్రత్యేక అవార్డులను అందించారు. విశాఖ ఎంపీ సత్యనారాయణ మాట్లాడుతూ ఇటువంటి ఆర్ డబ్ల్యూఎలు చేస్తున్న మంచి కార్ర్యకమాలతోనే దేశంలోని అభివృద్ధి చెందుతున్న నగరాల్లో విశాఖ నగరం ముందు వరసలో ఉందన్నారు. అనంతరం కమిషనర్ సృజన మాట్లాడుతూ జి.సృజన మాట్లాడుతూ ప్రజలు, జీవీ ఎంసీ కలసి పనిచేస్తే విశాఖ నగరం మరింత అభివృద్ధి చెందుతుందన్నారు.

అభివృద్ధి కార్యక్రమాల్లో చూస్తుంటే తన పరిధిని, జ్ఞానాన్ని పెంచుతున్నందుకు ఏపీ పెర్వాసకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జోనల్ కమిషనర్ సింహచలం, సీ ఎం హెచ్వో డాక్టర్ శాస్త్రి, ఎ ఎంహెచ్వో డాక్టర్ రాజేష్, లక్షితులసీ, జయరాం, ఏపీ పెరావాస్ అధ్యక్షుడు ఉదయ్ షిర్నామే, కార్యదర్శి కె ఎస్ ఆర్ మూర్తి, జనరల్ సెక్రటరీ రమణారావు, ఆనంద సిటిజన్ సంస్థ డైరెక్టర్ వాణీ పాల్గొన్నారు.




# ఆలిండియా పోలీసు లాన్ టెన్నిస్ ఛాంపియన్‌షిప్-2019



విశాఖ సిటీ : విశాఖ నగరంలో ఈ నెల తేది 19 నుండి 22 వరకూ ఆలిండియా పోలీసు లాన్ టెన్నిస్ ఛాంపియన్‌షిప్-2019 జరగనుంది.

ఈ క్రీడల నందు దేశంలోని అన్ని రాష్ట్రాలకు చెందిన పోలీసు క్రీడాకారులు పాల్గొనున్నారు. విశాఖ నగరంలో ప్రతిష్టాత్మకముగా నిర్వహించ బోయే ఈ క్రీడల కోసం నగరములోని పోలీసు సమావేశ మందిరములో ప్రత్యేకముగా సమావేశం నిర్వహించడం జరిగినది.

ఈ సమావేశంలో ఏ.డి.జి.పి (స్పోర్ట్స్ ) ఎన్.శ్రీధర్ రావు, ఐ.పి.ఎస్.,తో పాటు నగర పోలీస్ కమీషనర్ ఆర్.కే.మీనా , ఐ.పి.ఎస్., విశాఖ జిల్లా ఎస్.పి బాబూజి అట్టాడ, ఐ.పి.ఎస్., మరియు ఏ.డి.సి.పి లు ,ఏ.సి.పి లు ఇతర పోలీసు ఉన్న తాధికారులు పాల్గొనడం జరిగినది.

# అప్పన్నను దర్శించుకున్న మంత్రి ముత్తంశెట్టి శ్రీనివాసరావు



సింహాచలం: సింహాద్రిపై కొలువు తీరివున్న వరాహ లక్ష్మీ నృసింహ స్వామివారిని రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి ముత్తం శెట్టి శ్రీనివాసరావు శనివారము దర్శించుకున్నారు. సింహగిరికి చేరుకున్న వీరికి అలయ ఈఓ ఎం వేంకటేశ్వర రావు మేళతాళాలు మంగళవాయిద్యాల నడుమ ఘనస్వాగతం పలకగా, అర్చక స్వాములు పూర్ణకుంభంతో ఆహ్వానం పలికారు. తొలుత కప్పస్థంభం ఆలింగనం చేసుకోగా స్వామివారికి తమ గోత్రనామాలతో ప్రత్యేక పూజలు చేయించారు. దర్శనానంతరం వేద పండితులు ఆశీర్వచనం పలికారు. అలయ సహాయ కార్యనిర్వాహణాధికారి స్వామివారి శేషవస్త్రంతో సత్కరించి తీర్థప్రసాదలు అందజేశారు. వీరి వెంట 72వ వార్డు వైసీపీ నాయకులు కొలుసు ఈశ్వరరావు, గంట్ల కిరణ్ బాబు, కర్రి సత్తిబాబు, లంక సత్తిబాబు, దాసరి కనకరాజు, నక్కా ఆనంద్, శ్రీనివాస్ వర్మ, నందకిషోర్, మంథా కాళిబాబు, ఇతర వైసీపీ నాయకులు అయన వెంట పాల్గొన్నారు.



## తప్పు చేస్తే సస్పెండ్ చేయకుండా

# సన్మానం చేస్తారా?



అమరావతి : పరిశ్రమల శాఖ నివేదికతోనే ఐఆర్ఎస్ అధికారి జాస్తి కృష్ణకిషోర్‌పై వేటు వేయడం జరిగిందని వైఎస్సార్‌సీపీ అధికార ప్రతినిధి, ఎమ్మెల్యే అంబటి రాంబాబు స్పష్టం చేశారు. అవినీతి ఆరోపణలతోనే ఆయనను ప్రభుత్వం సస్పెండ్ చేసిందని పేర్కొన్నారు. అయితే దీనిని రాష్ట్ర, జాతీయ సమస్యగా టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు, ఎల్లోమీడియా తప్పుగా చిత్రీకరిస్తోందని మండిపడ్డారు. తప్పు చేసిన అధికారిని సస్పెండ్ చేయకుండా సన్మానం చేస్తారా అంటూ ధ్వజమెత్తారు.

శనివారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ... కృష్ణ కిషోర్ సస్పెన్షన్‌పై చంద్రబాబు గగ్గోలు పెట్టడం విడ్డూరంగా ఉందని విమర్శించారు. గతంలో బాబు అధికారంలో ఉన్నప్పుడు కృష్ణ కిషోర్ తనకు అనుకూలంగా పనిచేయడం వల్లే ఇప్పుడు ఇలా పెడబొబ్బలు పెడుతున్నారని ఎద్దేవా చేశారు. తప్పు చేశారని ఆధారాలుంటే ఎంతటి అధికారులైనా సరే చర్యలు తప్పవని హెచ్చరించారు.

గతంలో కాంగ్రెస్, చంద్రబాబు కుట్రతోనే వైఎస్ జగన్‌పై కేసులు పెట్టారని పేర్కొన్నారు. ప్రస్తుతం జరుగుతున్న సభలో అసెంబ్లీ ఛీఫ్ మార్షల్‌ను బహిరంగంగానే చంద్రబాబు, లోకేష్‌లు దూషించారని గుర్తు చేశారు. సభలో ఎదైనా జరగరానిది జరిగితే ఎవరు బాధ్యత వహిస్తారని ప్రశ్నించారు. గతంలో ఎన్నిసార్లు ముఖ్యమంత్రిగా పని చేసినా చట్టానికి లోబడే పని చేయాలని అంబటి వెల్లడించారు.

# 21న ధర్మవరంలో సీఎం జగన్ పర్యటన



అనంతపురం: అనంతపురం జిల్లాలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి పర్యటన ఖరారు అయింది. ఈ నెల 21న ఆయన ధర్మవరంలో పర్యటించనున్నారు. ధర్మవరంలో నేతన్న నేస్తం పథకాన్ని ముఖ్యమంత్రి ప్రారంభించనున్నారు.

ఈ సందర్భంగా ధర్మవరం జూనియర్ కళాశాల మైదానంలో ఏర్పాట్లను మంత్రి శంకర్ నారాయణ, ముఖ్యమంత్రి ప్రోగ్రాం కోఆర్డినేటర్ తలశిల రఘురామ్, ధర్మవరం ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకట్రామిరెడ్డి, కలెక్టర్ చంద్రుడు, జిల్లా ఎస్పీ సత్యా యేసుబాబు పరిశీలించారు. కాగా వైఎస్సార్ నేతన్న నేస్తం పథకం కింద సొంత మగ్గం కలిగిన చేనేత కుటుంబాలకు రాష్ట్ర ప్రభుత్వం ఏడాదికి రూ. 24 వేలు అందిస్తారని తెలపారు. సొంతంగా మగ్గాలున్న ప్రతి కుటుంబానికి ఈ పథకం ద్వారా లబ్ధి చేకూరనుంది. దారిద్ర్య రేఖకు దిగువన, మగ్గం ఉన్న ప్రతి చేనేత కుటుంబం ఈ పథకానికి అర్హులు.

# ఎన్టీపిసికి 9 ఉత్తమ అవార్డులు

## మంత్రి మహమ్మద్ అలీ చేతుల మీదగా అందజేత



పరవాడ: ఎన్టీపిసీ నేషనల్ దర్మల్ పవర్ కార్పోరేషన్ ఎన్టీపీసీ లిమిటెడ్‌కు ఉత్తమ అవార్డులు అభించాయి. దీంట్లో బాగంగా హైదరాబాద్‌లో ఒక కార్యక్సమంలో శుక్రవారము ఎన్టీపిసి సియస్ అర్ విభాగానికి ఒక అవార్డు, పియస్‌యు సంస్దకు ఉత్తమ అవార్డులును మంత్రి మహ మ్మద్ అలీ చేతులుమీదగా పిఅర్వో మల్లయ్యకు అంద జేసారు.మరోక్క అవార్డును హెచ్అర్ ఎ.ఎన్ .వర్మకు కూడా మంత్రి చేతులు మీదగా అందజేసారు. ఈ కార్యక్రమంలో ఎన్టీపిసి సిజిఎమ్ వి.సుదర్శన్ బాబు, సియస్ అర్ సినియర్ మేనజర్ పి.అనంత్ జగన్నాధ్ మరియుతదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా కనక మహాలక్ష్మి మార్గశిర మాసోత్సవాలు



బురుజుపేట : నగరంలో గల శ్రీ కనకమహాలక్ష్మి అమ్మవారి దేవస్థానంలో తేది. 27-11-2019న ప్రారంభమైన మార్గశిర మాసోత్సవములు సందర్భంగా శ్రీచక్రనవవర్నార్చన, లక్ష్మీ హోమం, వేదపారాయణ, సప్తశతీ పారాయణ, మహావిద్యాపారాయణ నిర్వహించుట జరిగినది. నేటికి 17వ రోజు శనివారం అగుటచే అధిక సంఖ్యలో భక్తులు శ్రీ అమ్మవారిని దర్శించుకున్నారు.

**అన్నధానం:**

ప్రతి రోజు నిర్వహించు అన్న ప్రసాద వితరణ నేడు 3,000 మంది భక్తులకు నిర్వహించుట జరిగినది.

**సాంస్కృతిక కార్యక్రమం:**

సాంస్కృతిక కార్యక్రమములలో బాగంగా వి. సుమిత్ర వారిచే అన్నమాచార్య కీర్తనలు భక్తులను ఏంతగానో అలరించినది.

**వేదపండిత సదస్సు పండిత సత్కారం :**

మార్గశిర మాసోత్సవముల సందర్భంగా నేటి ఆదివారం సాయంత్రం వేదపండిత సభ ఏర్పాటు చేయడమైనది. ఈ వేదసభలో రాష్ట్రం నలుమూలల నుండి చతుర్వేద పండితులు విచ్చేయుదురు. వేదసభ అనంతరం పండిత సత్కారం జరుగును. ఈ వేదసభకు శ్రీ శ్రీ శ్రీ స్వరూపానందేంద్ర సరస్వతి మహాస్వామీజీ ముఖ్య అతిధిగా విచ్చేయుదురు. కావున భక్తులు ఈ కార్యక్రమంలో పాల్గొన వలసిందిగా ఉపకమీషనరు కార్యనిర్వాహణాధికారి పేర్కొన్నారు.

# భారతీయ ఆత్మ ముక్కచెక్కలు : సోనియా



న్యూఢిల్లీ: కేంద్రంలోని మోదీ సర్కార్ తీరు, అనుసరిస్తున్న విధానాలు, మోదీ వైఫల్యాలపై కాంగ్రెస్ అధ్యక్షురాలు సోనియాగాంధీ నిప్పులు చెరిగారు. ఒక అధికరణను బలవంతంగా రుద్దాలన్నా, తొలగించాలన్నా, రాష్ట్ర హోదా మార్చాలన్నా...ఇలా వారికి ఏది తోస్తే అలా చేస్తూ పోతున్న పరిస్థితి కనిపిస్తోందని అన్నారు. ఎప్పుడు అనుకుంటే అప్పుడు రాష్ట్రపతి పాలన విధించడం, రద్దు చేయడం, చర్చ లేకుండానే బిల్లులు ఆమోదించుకుంటూ పోతున్నారని మోదీ సర్కార్‌పై మండిపడ్డారు.

శనివారం రామ్‌లీలా మైదానంలో కాంగ్రెస్ పార్టీ పెద్దఎత్తున నిర్వహించిన 'భారత్ బచావో' ర్యాలీలో సోనియాగాంధీ ఉద్వేగంగా ప్రసంగించారు.

పౌరసత్వ సవరణ చట్టంతో భారతీయ ఆత్మ ముక్కలు చెక్కలు అవుతున్నా, అసోం, ఇతర ఈశాన్య రాష్ట్రాల్లో నిరసనలు, ఆందోళనలు వ్యక్తమవుతున్నా మోదీ, అమిత్‌షాలకు ఎలాంటి పట్టింపు లేకుండా పోయిందని సోనియాగాంధీ విమర్శించారు.

VIJAYABHANU - Visakhapatnam
Editor : B. Chandra Sekhar, Printed and Published by him on behalf of **VIJAYABHANU PUBLICATIONS PVT. LTD.,** Published and Printed at **VIJAYABHANU PRESS,** D.No. 9-3-17, Pithapuram Colony, Visakhapatnam - 530 003.
R.N.I. No. 32157/77. Postal Regd. No. J/VM-RNP/32 K Phone : 2564353, Fax : 0891-2569004 K e-mail: vijayabhanudaily@gmail.com